అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :249 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేదీ: శనివారం 13-12-2025 | పేజీలు:4 వెల: 2.00

నరసాపురం వరకు వందేభారత్ పొడిగింపు

చెన్నై, చెన్నై సెంట్రల్–విజయవాడ మధ్య నడుపుతున్న వందే భారత్ రైళ్లను పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వరకు తాత్కాలికంగా పొడిగించారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... నెం.20677 చెన్నై సెంట్రల్–నరసాపురం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15 నుంచి జనవరి 11వ తేది వరకు చెన్నై సెంట్రల్‌లో ఉదయం 5.30 గంటలకు బయల్దేరి 7.05 గంటలకు రేణిగుంట, 8.29 గంటలకు నెల్లూరు, 9.43 గంటలకు ఒంగోలు, 11.08 గంటలకు విజయవాడ, మధ్యాహ్నం 12.29 గుడివాడ, 1.14 గంటలకు భీమవరం టౌన్, 2.10 గంటలకు నరసాపురం చేరుకుంటుంది.మరుమార్గంలో, నెం.20678 నరసాపురం–చెన్నై సెంట్రల్ వందే భారత్ ఈ నెల 17 నుంచి జనవరి 11వ తేది వరకు నరసాపురం(ఔజీసజీబజూబీసజీప)లో మధ్యాహ్నం 2.50 గంటలకు బయల్దేరి 3.19 గంటలకు భీమవరం టౌన్, సాయంత్రం 4.04 గంటలకు గుడివాడ, 4.50 గంటలకు విజయవాడ, 6.29 గంటలకు ఒంగోలు, రాత్రి 7.39 గంటలకు నెల్లూరు, 9.50 గంటలకు రేణిగుంట, 11.45 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుందని దక్షిణ రైల్వే తెలిపింది.

తెలంగాణ ప్రభుత్వంతో అమెజాన్ ఒప్పందం

హైదరాబాద్,తెలంగాణ(Telangana) రాష్ట్రానికి మరో ప్రాముఖ్యమైన పెట్టుబడి ఒప్పందం అందింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వంతో అమెజాన్ సంస్థ అంగీకరించిన ఒప్పందం ద్వారా, రాష్ట్రంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ తమ కార్యకలాపాలను విస్తరించనుంది. దీనిలో భాగంగా అమెజాన్ రూ. 58 వేల కోట్ల (7 బిలియన్ అమెరికన్ డాలర్లు) పెట్టుబడితో AWS డేటా సెంటర్లను విస్తరించనుంది. ఈ ఒప్పందం తెలంగాణకు డిజిటల్ మౌలిక సదుపాయాల జాలాన్ని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించనుంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చుకోవడంలో ఈ పెట్టుబడులు దోహదపడతాయని అధికారులు భావిస్తున్నారు. అమెజాన్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా, ప్రభుత్వ రవాణా, విద్యుత్, భూమి, అనుమతుల సహాయం, మరియు వ్యాపార వాతావరణం వంటి అనేక సదుపాయాలు కల్పించనుంది.

తెలంగాణలో ఇండియా డేటా సెంటర్‌గా మరింత అభివృద్ధి

ఈ ఒప్పందం ద్వారా తెలంగాణలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ విస్తరించడంతో, హైదరాబాద్ ఇండియా డేటా సెంటర్‌గా మరింత అభివృద్ధి చెందనుంది. ఇందు కోసం ప్రభుత్వ మద్దతుతో, AI, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ మౌలిక సదుపాయాలు మరియు ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోబ డతాయి. అమెజాన్ ద్వారా వచ్చిన ఈ పెట్టుబడులు, రాష్ట్రంలో సాంకేతిక రంగంలో ఉ ద్యోగాలు, ఆవిష్కరణ అవకాశాలను పెంచుతాయని, సాంకేతిక పరిజ్ఞానం విస్తరించడానికి దోహదపడతాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

వారికి లీగల్ నోటీసులు..గుంటనక్కపై సీబీఐకి ఫిర్యాదు

సస్పెండ్ చేశాక కూడా ఇంకా మీ కళ్లు చల్లబడలేదా అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పై మండిపడ్డారు. మీ వెనుక ఉన్న గుంటనక్కను మాత్రం వదిలేది లేదన్నారు.

హైదరాబాద్ : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత మరోసారి బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలపై తీవ్ర అవినీతి ఆరోపణలతో విరుచుకప డ్డారు. కవిత, ఆమె భర్తపై భూకబ్జా ఆరోపణలు చేసిన కూకట్ పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, టీ న్యూస్ చానెళ్లకు లీగల్ నోటీసులు పంపిస్తున్నట్లుగా వెల్లడించారు. శుక్రవారం జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత వారం రోజుల్లోగా మాపై అరోపణలు చేసిన మాధవరం, ఏలేటి, టీ, న్యూస్ చానెళ్లు క్షమాపణలు చెప్పాలని లేదంటే చట్టపరంగా ముందుకెలుతానని ప్రకటించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులపై నేను విమర్శలు చేస్తే..బీజేపీ నాయకులకు బాధ ఎందుకని ప్రశ్నించా రు. మాధవరం కృష్ణారావు వెనుక ఉన్న గుంటనక్క వివరాలు త్వరలో బయటపెడు తానని, ఆ గుంట నక్కపై విజిలెన్స్, సీబీఐకి ఫిర్యాదు చేయబోతున్నట్లుగా తెలిపారు.

బీఆర్ఎస్ అవినీతి చిట్టా విప్పలేదు..టాస్ మాత్రమే వేశాను

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 14ఏళ్లలో ఎన్నోఅవినీతి, అక్రమాలు, భూకబ్జాలు జరిగాయని కవిత ఆరోపించారు. తాను ఏదో ఒక రోజు సీఎం అవుతానని, అప్పుడు బీఆర్ఎస్ హయంలో జరిగిన అన్ని విషయాలపై విచారణ జరిపిస్తానన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల అవినీతి చిట్టా తాను ఇంకా విప్పలేదని..తాను టాస్ మాత్రమే వేశానని, టెస్టు మ్యాచ్ ముందుందన్నారు. జనం బాటలో నా దృష్టికి వచ్చిన సమస్యలనే తాను ప్రస్తావించానని..బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమాలపై నాకు నిత్యం ఎన్నో ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎంతోమందిని బెదిరించి డబ్బులు వసూలు చేశారన్నారు. ఇంతకాలం తాను ఆ విషయాలను వెల్లడించలేదని..ఇక ఊరుకోబోనన్నారు. తనపై విమర్శలు చేస్తే ప్రతిస్పందన ఘాటుగా ఉంటుందని హెచ్చరించారు. ఉద్యమ సమయంలో నా నగలు కుదవ పెట్టి మరి బతుకమ్మ నడిపించానని..మీలాగా నేను బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క రూపాయి లాభం పొందలేదని, అవినీతికి పాల్పడలేదని కవిత స్పష్టం చేశారు. మీరు చేసిన అవినీతిని నాపై రుద్దే ప్రయత్నం చేస్తే సహించేది లేదన్నారు. నేను నిజమాబాద్ ఎంపీగా ఢిల్లీలో ఉంటే మీరు ఇక్కడ కేసీఆర్ నీడన పందికొక్కుల్లాగా దోచుకున్నారని కవిత ఆరోపించారు. బీఆర్ఎస్ నుంచి హిల్ట్ పాలసీ తెచ్చిందే కేటీఆర్

హిల్ట్ పాలసీపై ఇప్పుడు బీఆర్ఎస్ గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందని..అసలు చేంజ్ ఆఫ్ ల్యాండ్స్ జీవోలపై సంతకం పెట్టిందే కేటీఆర్ అని కవిత కీలక ఆరోపణలు చేశారు. భూ కేటాయింపులు, బదలాయింపులపై బీఆర్ఎస్ కిటికీలు తెరిస్తే..కాంగ్రెస్ ప్రభుత్వం తలుపులు తెరిచి దోచుకుంటుందని కవిత ఆరోపించారు. బీఆర్ఎస్ పాలకులు అవినీతి చేశారని..వారిని అరెస్టు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేసిన అవినీతిలో కాంగ్రెస్ నేతల భాగస్వామ్యం కూడా ఉందని అందుకే చర్యలు లేవన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే పరిశ్రమల భూమిని నివాస భూమిగా మార్చి మాధవరం కృష్ణారావు కొడుకు, కేటీఆర్ బినామీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిలు భారీ విల్లాలు, అపార్ట్ మెంట్లు కట్టారని కవిత ఆరోపించారు. బీఆర్ఎస్ అవినీతిలో కాంగ్రెస్ కు భాగస్వామ్యం లేకపోతే.. పోచంపల్లి ఫామ్ హౌస్ కేసును ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని కవిత నిలదీశారు. కృష్ణారావు, ఆయన కొడుకు వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్ లో భారీ అక్రమాలు జరిగాయని.. పది ఎకరాలు ఉన్న చెరువును ఆరు ఎకరాలకు కుదించి..నాలుగు ఎకరాలను మింగారని..అదేమన్న మీ అయ్య జాగిరా అని ప్రశ్నించారు. ఊరు ప్రజలు ఉపయోగించుకోవాల్సిన చెరువు చుట్టూ ప్రహరి కట్టారని కేజీఎఫ్ సామ్రాజ్యాన్ని సృష్టించారని కవిత ఆరోపించారు.

సీఎం మార్పు ఊహాగానాల వేళ విందు రాజకీయాలు..

సీఎం ఇలా వేర్వేరు డిన్నర్ మీట్‌లు రాజకీయంగా తీవ్ర చర్చనీ యాంశమవుతున్నాయి.

బెంగళూర్ :కర్ణాటకలో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. గత కొన్ని రోజులుగా కర్ణాటకలో నాయకత్వ (మార్పు ఊహాగానాలు ఊపందుకున్న విషయం తెలిసిందే. ఈ ఊహాగానాల వేళ విందు రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఇటీవలే సీఎం, డప్యూటీ సీఎం ఇద్దరూ ఒకరింటికి ఒకరు వెళ్లి బ్రేక్‌ఫాస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులకు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ (డిన్నర్ పార్టీ ఇవ్వడం ఆసక్తికరంగా మారింది.బేలాలో పార్టీ నేత ప్రవీణ్‌కు చెందిన ఫామ్ హౌస్‌లో గురువారం రాత్రి జరిగిన ఈ విందు భేటీలో దాదాపు 30 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు , పలువురు మంత్రులు పాల్గొన్నట్లు తెలుస్తోంది. బీజేపీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యేలు ఎస్‌టీ సోమశేఖర్, శివరామ్ హెబ్బర్ కూడా పాల్గొన్నట్లు సమాచారం. అంతకుముందు సీఎం సిద్ధరామయ్య కూడా పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులతో డిన్నర్ చేయడం గమనార్హం. వారికి బెళగావి నార్త్ ఎమ్మెల్యే ఫిరోజ్ ఆతిథ్యం ఇచ్చారు. ముఖ్యమంత్రి మార్పు ఊహాగానాల వేళ సీఎం, డిప్యూటీ

ఫోన్ ట్యాపింగ్ కేసు..సరెండరైన ప్రభాకర్ రావు

హైదరాబాద్ : తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్ రావు పోలీసులకు లొంగిపోయారు సుప్రీంకోర్టు ఆదేశాలు నేపథ్యంలో శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ కు వెళ్లి సిట్ పోలీసులకు లొంగిపోయారు. ప్రభాకర్ రావును వారం రోజుల కస్టడీ విచారణకు సుప్రీంకోర్టు అనుమతించింది. దీంతో పోలీసులు ఆయనను కస్టోడియల్ విచారణ చేయనున్నారు.బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసు సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఎస్ఐబీ మాజీ చీఫ్ గా ప్రభాకర్ రావు సారధ్యంలో డీఎస్పీ ప్రణీత్ రావు, డీసీపీ రాధాకిషన్ రావు, ఏసీపీలు భుజంగరావు, తిరుపతయ్యల బృందం ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడింది. ఎంపిక చేసుకున్న ప్రతిపక్ష రాజకీయ నాయకులు, జడ్జీలు, జర్నలిస్టులు, సెలబ్రెటీలు, కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, నగల వ్యాపారుల ఫోన్లను ట్యాపింగ్ చేశారు. నిందితుల్లో శ్రవణ్ రావు, ప్రభాకర్ రావు మినహా మిగతా వారిని అరెస్టు చేసి విచారించారు. దాదాపు 4వేల ఫోన్లకు పైగా వారు ట్యాపింగ్ చేసినట్లుగా సిట్ విచారణలో గుర్తించింది.అయితే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన వెంటనే..నిందితులు ట్యాపింగ్ చేసిన డెటాను ధ్వంసం చేశారు. దీంతో సిట్ కు 300నుంచి 400కు పైగా ఫోన్ల సమాచారం మాత్రం లభ్యమైంది. ఈ లభించిన ఆధారాల మేరకు బాధితుల నుంచి వాంగ్మూలాలు నమోదు చేశారు. రాధాకిషన్ తన కన్‌ఫెషన్‌లో మాజీ సీఎం కేసీఆర్ ప్రస్తావన తెచ్చినట్లు తెలుస్తోంది. ఈ కేసులో కేసీఆర్‌కు పదేళ్లపాటు ఓఎస్డీగా పని చేసిన పీ రాజశేఖర్ రెడ్డిని ఇటీవలే సిట్ ప్రశ్నించింది.ఇకపోతే..ట్యాపింగ్ కేసు నమోదైన వెంటనే ప్రభాకర్ రావు సహా నిందితుడు శ్రవణ్ రావుతో కలిసి అమెరికా పారిపోయారు. చివరకు పోలీసుల ఒత్తిడి ఫలించి సుప్రీంకోర్టు మధ్యంతర రక్షణతో ప్రభాకర్ రావు రాష్ట్రానికి తిరిగి వచ్చారు. అయితే సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీ మేరకు ఆయన విచారణకు సహకరించడం లేదని మధ్యంతర బెయిల్ రద్దు చేసి కస్టడీకి అనుమతించాలని సిట్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రభాకర్ రావును లొంగిపోవాలని ఆదేశిస్తూ..వారం రోజుల కస్టడీకి అనుమతించింది. కేసు తదుపరి విచారణను 19వ తేదీకి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో ప్రభాకర్ రావు సిట్ ముందు లొంగిపోయారు. ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణతో ఈ కేసు కీలక మలుపు తిరిగే అవకాశముందని విచారణాధికారులు భావిస్తున్నారు.

మారనున్న ఉపాధి హామీ పథకం పేరు.. కొత్త నేమ్ ఇదే!

న్యూఢిల్లీ,యూపీఏ హయాంలో ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం దేశ వ్యాప్తంగా అమలవుతోంది. మోడీ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి ఎలాంటి ఆటంకం లేకుండా పథకాన్ని కొనసాగిస్తున్నారు.అయితే తాజాగా ఈ పథకం పేరును మార్చాలని మోడీ ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. శుక్రవారం జరిగే కేంద్ర కేబినెట్ సమావేశంలో పథకం పేరు మార్పుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.ప్రస్తుతం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 (MGNREGA)గా ఉన్న పేరును "పూజ్య బాపు గ్రామీణ ఉపాధి హామీ బిల్లు 2025"గా మార్చే ప్రతిపాదనను కేంద్ర మంత్రివర్గం ఆమోదించవచ్చని శు క్రవారం ప్రభుత్వ ఉన్నత వర్గాలు పేర్కొన్నాయి.గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు జీవన భృతి కల్పించేందుకు గత యూపీఏ హయాంలో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒకటిగా ఉంది. డిసెంబర్ 12న మోడీ అధ్యర్యంలో కేబినెట్ సమావేశం కానుంది. ఈ భేటీలో పథకం పేరు మార్పుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఉపాధి హామీ పథకాన్ని మరింతగా బలోపేతం చేసేందుకు ఈ పథకం పేరు మారుస్తున్నట్లుగా వర్గాలు తెలిపాయి. అంతేకాకుండా విద్యా రంగాన్ని కూడా సంస్కరించే లక్ష్యంతో వికాస్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లు-2025ను కూడా ఆమోదించే ఛాన్సుంది.ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 100 రోజుల వేతనంతో కూడిన పథకంగా అమలవుతోంది. సామాజిక తనిఖీల తర్వాత వేతనాలు చెల్లిస్తుంటారు. కోవిడ్ సమయంలో ఈ పథకం చాలా మందికి మేలు చేసింది. పెద్ద సంఖ్యలో ఈ పథకంపై ఆధారపడ్డారు. ఇంటికి దగ్గరలోనే పని కల్పిస్తుంటారు.

మోదీ పై వైఎస్ షర్మిల వివాదాస్పద వ్యాఖ్యలు

అమరావతి,ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై, ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో అసలు పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకోకుండా కూటమి పాలనను ప్రశంసించడం ప్రధాని చేసిన పెద్ద తప్పిదమని ఆమె వ్యాఖ్యానించారు. "పచ్చకామెర్లు ఉన్నవారికి లోకం అంతా పచ్చగా కనిపించినట్టే మోదీ గారికి ఏపీ పరిపాలన అద్భుతంగా కనిపిస్తోంది" అని ఆమె ఎద్దేవా చేశారు. రైతులు, విద్యార్థులు, రోగులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధాని దృష్టికి ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు.

కూటమి పాలన అబద్ధాలతో నిండిపోయిందని షర్మిల విమర్శ

ఒక ప్రకటనలో షర్మిల మాట్లాడుతూ"రైతులకు గిట్టుబాటు ధర లేక పంటలు ధ్వంసం చేయాల్సిన పరిస్థితి వచ్చినా, తుపాన్లలో నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైంది. ఈ వాస్తవాలు మోదీ గారికి దూరంగానే ఉన్నాయి. వెల్ఫేర్ హాస్టల్లో విద్యార్థుల మరణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక యువత ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఆరోగ్యశ్రీ నిలిచిపోవడంతో చికిత్స కోసం తంటాలు పడుతున్న రోగుల పరిస్థితి ఆయనకు పట్టడం లేదు" అని అన్నారు. 'సూపర్ సిక్స్' పేరుతో ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు.

"ప్రజలను మోసం చేస్తున్నారు"

ఏపీ ప్రజల హక్కులను, విభజన సమయంలో ఇచ్చిన హామీలను కూటమి నాయకులు ప్రధాని ముందు తాకట్టు పెట్టారని షర్మిల దుయ్యబట్టారు. "వాళ్లు చెప్పినట్లే తల ఊపే పరిస్థితిలో ఉన్నందుకే కూటమి పాలన మోదీకి పరిపూర్ణంగా కనిపిస్తోంది. ప్రధాని పదవి ఉంది కాబట్టి అబద్ధాలను నిజాల్లా చూపించాలనుకుంటే ప్రజలు నమ్మరు" అని ఆమె వ్యాఖ్యానించారు.కూటమి నేతృత్వం వహిస్తున్న ప్రభుత్వం అసమర్థంగా పనిచేస్తుందని, ప్రచారమే తప్ప ఆచరణలో ఏ హామీ కూడా అమలు చేయలేదని షర్మిల అన్నారు. రాష్ట్ర ప్రజల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే ప్రత్యేక హోదా అమలు చేయాలని, విభజన హామీలను నెరవేర్చాలని, అమరావతి అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు.

డెలివరీ కోసమా.. అయితే పసాలివ్వం

వాషింగ్టన్, అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం వలసలపై కఠినంగా వ్యవహరిస్తోన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా వీసాల జారీ విషయంలోనూ కఠిన నిబంధనలను అమల్లోకి తెచ్చింది. కొందరు అమెరికా పౌరసత్వం పొందేందుకు టూరిస్ట్ వీసాతో డెలివరీ కోసం అమెరికా వెళ్తుంటారు.

తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే హవా!

హైదరాబాద్, తెలంగాణ గ్రామ పంచాయతీ తొలి విడత ఎన్నికల ఫలితాలలో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. సింహభాగం సర్పంచ్ పదవులను, వార్డు స్థానాలను గెలుచుకుని ఎన్నికల్లో కాంగ్రెస్ ఆధిపత్యం చాటింది. తొలి విడతలో 189మండలాలల్లోని 4236గ్రామ పంచాయతీలకు పోలింగ్ జరుగాల్సి ఉండగా..అందులో 395 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఏకగ్రీవమైన వాటిలో 70శాతం వరకు అధికార కాంగ్రెస్ ఖాతాలోనే పడ్డాయి. ఇకపోతే గురువారం ఎన్నికలు జరిగిన 3,834పంచాయతీల సర్పంచ్ స్థానాల్లో మెజార్టీ సర్పంచ్ లను కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది. రాష్ట్రంలో అధికార పార్టీగా ఉ న్న కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే..గ్రామాల అభివృద్ధికి అవకాశం ఉంటుందన్న సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేల ప్రచారంతో పాటు అధికార పార్టీగా ఉన్న వనరులు, అవకాశాల నేపథ్యంలో ఆ పార్టీ సర్పంచ్ ఎన్నికల్లో ఆధిపత్యాన్ని చాటుకుంది. 33జిల్లాల్లో సిద్దిపేట, కుమరం భీమ్ అసిఫాబాద్ మినహా అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ పైచేయి సాధించింది. తెలంగాణ పంచాయతీ తొలి విడత ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 84.28శాతం పోలింగ్ నమోదైనట్లుగా రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 92.98శాతం, అత్యల్పంగా కొత్తగూడెం జిల్లాలో 71.79శాతం పోలింగ్ నమోదైనట్లుగా వెల్లడించింది.ఏకగ్రీవ సర్పంచ్ లతో కలిపి తొలి విడతలో 4236సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగగా..వాటిలో కాంగ్రెస్ పార్టీ 2,326 సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ పార్టీ 1,162 సర్పంచ్ స్థానాలను సాధించింది. బీజేపీ 188 స్థానాలలో గెలుపొందింది. ఇతరులు, స్వతంత్రులు 539స్థానాల్లో గెలుపొందారు. ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్ లు, వార్డు సభ్యుల అనుచరులు, పార్టీ శ్రేణుల విజయోత్సవ సంబరాలతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తనకున్న బలమైన కేడర్ తో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను గట్టిగానే ఎదుర్కొందని చెప్పవచ్చు. ఎన్నికల్లో ఆ పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఇచ్చిన పోటీ అనేక చోట్ల నువ్వా నేనా అన్నట్లుగా సాగడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ నియోజవర్గాల ఎమ్మెల్యేల స్థానాల్లో మెజార్టీ స్థానాలు కోల్పోయి అధికారాన్ని చేజార్చుకున్న బీఆర్ఎస్, పార్లమెంటు ఎన్నికల్లో జీరోకే పరిమితమైంది. అయినప్పటికి సర్పంచ్ ఎన్నికల్లో ఆ పార్టీ కేడర్ అగ్ర నాయకత్వం మద్దతు లేకపోయిన గ్రామాల్లో తమ అస్తిత్వం కోసం మెరుగైన పోరాటం సాగించడంతో ఆ పార్టీకి సర్పంచ్ ఎన్నికల్లో గౌరవ ప్రదమైన సంఖ్యను కట్టబెట్టింది.ఉమ్మడి నల్లగొండ, వరంగల్, కరీంనగర్, అదిలాబాద్, ఖమ్మం, మహబూబ్ నగర్ జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లు భారీ సంఖ్యలో గెలుపొందారు. ముఖ్యంగా తండాలు, గూడెల పంచాయతీల్లో కాంగ్రెస్ అధిపత్యం ప్రదర్శించింది. అక్కడక్కడ గెలిచిన ఇండిపెండెంట్లు సైతం ఫలితాల అనంతరం గ్రామాభివృద్ధి కోణంలో కాంగ్రెస్ కండువా కప్పుకుంటుండటం కొసమెరుపు.

సంపాదకీయం

శనివారం 13-12-2025

ఎన్నికల సంస్కరణలపై చిత్తశుద్ధిలేని చర్చ !

పార్లమెంటులో ఎన్నికల సంస్కరణలపై చర్చ కాస్తా అసలు విషయాలను పక్కదారి పట్టించేలా ఉంది. అధికార బిజెపి లేదా ఎన్‌డిఏ కూడా పక్కాగా ఎన్నికల సంస్కరణల ప్రతిపాదనలు ప్రకటించడంలేదు. విపక్షనేత రాహుల్ కేవలం సర్‌ను వ్యతిరేకించడం మాత్రమే అలవాటు చేసుకున్నారు. ఇంటాబయటా ఆయన అదే పాట పాడుతున్నారు. రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకుని ఊరేగుతున్న రాహుల్‌కు రాజ్యాంగంలో ఏముందో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఎందుకంటే ఎన్నికల ప్రక్రియ విఫలం అవుతోంది. డబ్బున్న వారే ఎన్నికవుతున్నారు. ఒక్కరే పదేపదే చట్టసభల్లో ఉంటున్నారు. వీలయితే జీవితాంతం చట్టసభ సభ్యులుగా ఉంటున్నారు. ఇక దొంగ ఓట్లను చేర్పించి, ఓట్లను చోరీ చేస్తున్నారు. పదేపదే ఎన్నికల నిర్వహణతో దేశ ఖజానాపై భారం మోపుతున్నారు. ఒకేదేశం, ఒకే ఎన్నిక అంటున్న బిజెపి కూడా దీనిపై సమగ్ర విధానం ప్రకటించడం లేదు. ఎన్నికల సంస్కరణలపై చరచ అంటూ తము అనుకూలంగా లేని విషయాలపై పార్లమెంటులో చర్చిస్తున్నారు. మన ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాలను చర్చించాలి. ప్రధానంగా దేశానికి భారంగా మారిన పదేపదే ఎన్నికల నిర్వహణ విధానం మారాలి. అన్ని రాష్ట్రాల్లో ఒకే తడవలో ఎన్నికలు జరిగేలా చూడాలి. రాజకీయ పార్టీలు నిరంతరం ఎన్నికలు ఉండాలని కోరుకుంటున్నాయి. అలాగే తామే నిరంతరం ప్రజాప్రతినిధులుగా చట్టసభల్లో తిష్టవేయాలని చూసుకుంటున్నారు. ఇదే వీరి ఎన్నికల సంస్కరణగా ఉంది. దీనికోసమే అందరి ఆరాటంగా ఉంది. ఇందులో ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. ఎందుకంటే ప్రజాస్వామ్యం ముసుగులో నియంతలుగా మారుతున్నారు. అసలు అధికారాలే తక్కువగా ఉంటే సమస్య రాదు. చట్టసభలకు ఎన్నికైన సభ్యులకు అలవిమాలిన సౌకర్యాలను కూడా తగ్గించాలి. పెన్షన్లు తక్షణం ఎత్తేయాలి. 2026 జనాభా గణన ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. ఒకే దేశం, ఒకేఎన్నిక అంటే పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల కు ఒకేసారి ఎన్నికల నిర్వహణ జరగాలి. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ జరగాల్సిందే. అలాగే దొంగ ఓట్లు లేకుండా పక్కాగా ఓటరు కార్డు ఉండాలి. నిరంతరం ఓటరు జాబితాను సమీక్షించే అవకాశం రావాలి. ఎక్కడ నివాసం ఉంటే అక్కడే ఓటేసేలా చట్టబద్ధత ఉండాలి. నేతలు రెండు పర్యాయాలకు మించి పోటీ చేసే అవకాశం లేకుండా చూడాలి. ఈ క్రమంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియపై రాజీవ్ గాంధీ, మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, లెఫ్ట్ పార్టీలు ఎందుకు అభ్యంతరం చెబుతున్నాయో చెప్పాలి. నిజమైన ఓటర్లే జాబితాలో ఉండాలనే దానిని ఎందుకు వ్యతిరేకిస్తున్నారో జాతికి తెలియ చేయాలి. ఒక దేశం, ఒక ఎన్నిక అనేది బీజేపీకి ప్రయోజనాలను సమకూరుస్తుందనే వాదనలో పసలేదు. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభకు ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల అధికారంలో ఉన్న పార్టీకి పరిస్థితులు అనుకూలమవుతాయని చెబుతున్న మాటల్లో కూడా నిజం లేదు. ప్రజలు తక్కువ అంచనా వేయడం సరికాదు. ఓటుహక్కు నిరాకరణకు గురైనవారిలో ఎవరున్నా వారి పేర్లు బయటపెట్టి చూపగలగాలి. అలా చేయకుండా సర్ ప్రక్రియను వ్యతిరేకించడం సరికాదు. పార్లమెంటులో 'ఎన్నికల సంస్కరణల'పై చర్చ తలాతోకా లేకుండా సాగింది. ఎన్నికల సంస్కరణ అనేది ఓటర్లకు సంబంధించినది మాత్రమే కాదు. యావత్తు భారత జాతికి సంబంధించినది. ఇది పార్లమెంటులో ప్రస్తుతం ఉన్న ఎంపిల వ్యవహారం అస్సలు కానేకాదు. తమను అత్యున్నత చట్టసభకు తీసుకువచ్చి, తద్వారా అధికారాన్ని అప్పగించిన ఓటర్లు తమ ఓటు దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సి ఉంది. పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం నియమ నిబంధనలను మార్చాల్సిన ఆవశ్యకత విషయమై పార్లమెంటేరియన్లంతా చర్చించాలి. అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థి విజేత అవుతాడు. అలాంటి సమయంలో దొంగ ఓటర్లంతా ఓటేస్తే..తద్వారా ఎన్నికైన వారంతా ప్రజా ప్రతినిధులు ఎలా అవుతార్నదే ప్రశ్న. అలాగే ఎన్నికలలో ధనబలం, కండబలం ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకురావాల్సిన చట్టాల గురించీ ప్రధానంగా చర్చించాలి. ఎన్నికల సమగ్రత, నిష్పాక్షికత చాలా ముఖ్యం అన్న విషయం ఇక్కడ గుర్తించాలి. నిజానికి ఎన్నికల 'సంస్కరణల' గురించి కాకుండా ప్రస్తుత పాలకులు, విపక్షాలు కలసి తమకు అనుకూలంగా ఉండే విషయాలనే ప్రస్తావిస్తున్నారు. దానిపైనే చర్చిస్తున్నారు. ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాల కారణంగా రాజకీయ నేతలు అనుసరిస్తున్న వికృతాలను నిరోధించేందుకు పార్లమెంటు చర్చించడం కూడా ముఖ్యం. ఎన్నికలలో అక్రమాలు భారత్‌కే పరిమితం కాలేదు. ఎన్నికల నిర్వహణ అమలు చేస్తున్న అన్ని దేశాల్లో ఈ జాడ్యం ఉంది. ఉన్న నియమాలను నిరంకుశ పాలకులు తమకు అనుకూలంగా మార్చుకోవడమనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్నది. నియంతలు తమ ఇష్టారాజ్యంగా ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టిస్తూనే వస్తున్నారు. తమకు ప్రజల మద్దతు పూర్తిగా ఉన్నదని చూపడానికి దొంగ ఓట్లతో సాయం పొందుతున్నారు. రాజ్యాంగ సంస్థను తమకు అనుకూలంగా మార్చు కుంటున్నారు. ఎన్నికల నియమాలు పూర్తిగా తమకు అనుకూలంగా ఉండేలా చేస్తున్నారు. అందువల్ల మొదట నియమ నిబంధనలు మార్చాల్సి ఉంది. ప్రధానంగా ప్రజల భాగస్వామ్యం పెరగాలి. పేదలైన ప్రజలకు చట్టసభలో ప్రవేశించే అవకాశం రావాలి. అవసరమైతే ఇందుకు నిబంధనలు లేదా రిజర్వేషన్లు పెట్టాలి. చట్టసభల్లో నిరంతరం కొత్తవాళ్లు ఎన్నికలైతేనే అవినీతి, మోనోపలి తగ్గుతుంది. జాస్వామ్య వ్యవస్థను క్రమంగా నిరంకుశత్వం వైపు మళ్లించకుండా అడ్డుకోగలుగుతాం. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన నాయకులకు కాల పరిమితి ఉంటే అవినీతికి అంతగా ఆస్కారం ఉండదు. అందువల్ల ఎన్నికల సంస్కరణల ఆవశ్యకతను గుర్తించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టం చేయాలి. అంతేగాకుండా ఓటు వేయమన్నది బాధ్యత కూడా కావాలి. కావాలని ఓటేయని వారినిశిక్షించే పరిస్థితి కూడా ఉండాలి. ఇవన్నీ సాధ్యమైతేనే భారత ప్రజాస్వామ్యం మరింత బలపడగలదు.

తెలంగాణ సోయి ఏమైంది?

హైదరాబాద్,పదేళ్ల క్రితం దాకా తెలుగువాళ్లంతా ఒకే రాష్ట్రంగా ఉన్నారు. ఆంధ్ర ఆధిపత్యం, ఉమ్మడి పాలనలో తెలంగాణ నిర్లక్ష్యం ఇలా వివిధ కారణాల వల్ల స్వీయపాలన కోసం తెలంగాణ ఏర్పాటు అనివార్యమైంది. కళలలో కూడా ఆంధ్రుల ఆధిపత్యమే సాగడంవల్ల ఉమ్మడి పాలనలో తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక కళారూపాలు ధ్వంసమైన మాట కూడా నిజమే. అయినా ఆంధ్రప్రాంత కళలకు, కళాకారులకు, రచయితలకు ఈ వైపు నుంచి గౌరవాభిమానాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. వాటి ఆధిపత్యాన్ని అంగీకారం లభిస్తోంది. తెలుగు వారందరి లాగే తెలంగాణవాసులు కూడా ఆంధ్ర ఆధిపత్య సినిమాలను ఆదరిస్తున్నారు. దీనిని కేవలం వినోదంలో భాగంగా, అభిరుచిగానే చూడాలి. భవిష్యత్తులో తెలంగాణ భాష, కళలు విడిగా స్థిరపడే కార్యక్రమాలు అటు ప్రజల నుంచి మొదలై ప్రభుత్వ తోడ్పాటుతో ముందుకు సాగాలి. అలా కాలం గడిచిన కొద్దీ కొత్తగా పాదుకునే కళా వైవిధ్యాల పరిణామక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఎవరి సాంస్కృతిక చిహ్నాలు వారికి ఏర్పడవచ్చు. రాబోయే రచయితలు, కళాకారులు కూడా తాము ఉమ్మడి రాష్ట్ర వారసులుగా భావించే అవకాశం లేదు. అంతదాకా ఉమ్మడి రాష్ట్ర కాలంలోని రాజకీయ నాయకులు, రచయితలు, కళాకారులు, సినిమా నటులు ఇరువైపులా అభిమానం పొందుతారు.వివిధ రంగాల్లో ఉండి తెలంగాణను కావాలని తక్కువ చేసిన ఆంధ్రులకు మాత్రం ఎప్పటికి గౌరవం దొరకదు. రాష్ట్రం వేరుపడినా ఆంధ్ర ప్రాంతానికి చెందిన మహానుభావుల విషయంలో తెలంగాణ ప్రజలకు ఎలాంటి వ్యతిరేక, శత్రుభావన లేవు. ట్యాంక్ బ్యాండ్ పైని విగ్రహాల ధ్వంసం కూడా ఓ అక్రోశంలోంచి పుట్టిన కోప ఫలితమే తప్ప అదో ప్రణాళికాబద్ధ ప్రతిచర్య కాదు. దానికి ఆనాటి పాలకులే బాధ్యత వహించాలి. మరింత కాలం ప్రజల అభిమానాలను గౌరవిస్తూ ఉమ్మడి కాలంలో అలరించిన కళాకారులను ఇరువైపులా ఆదరణ లభిస్తుంది. అదే సమయంలో తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్దేశపూర్వకంగా ప్రత్యేక తెలంగాణను వ్యతిరేకించినవారు, ఆ విషయాన్నీ బహిరంగంగా ప్రకటించినవారు ఎప్పటికైనా తెలంగాణ శత్రువులే. రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించినవారు ఆంధ్రావారైనా, తెలంగాణవారైనా ఒకటే. తెలంగాణ సాధనను వ్యతిరేకించని వారితో పేచీ అక్కర లేదు. అయితే రేవంత్ ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రాథమ్యాలను పక్కనపెట్టి రాష్ట్రాలు రెండైనా తెలుగువారంతా ఒకటే అన్న రీతిలో చాప కింద నీరులా తమ ఆలోచనని విస్తరిస్తోంది. ఆంధ్రుల చేతిలో తెలంగాణ ప్రజలు పడిన అవమానాలు, వివక్షలు అన్నీ ఇంకా పచ్చిపచ్చిగానే ఉన్నాయి. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవారి ఆకాంక్షలు తీరని లేదు. అయితే కొత్త ప్రభుత్వం తెలంగాణ అస్తిత్వాన్ని కావాలని తొక్కివేసే కార్యక్రమాలు చేపడుతోంది.కొన్ని సంఘటనలను చూస్తుంటే తెలంగాణ రాష్ట్ర పగ్గాలు ఆంధ్ర రాష్ట్ర సారథి చేతిలో ఉన్నాయా అనిపించేలా ఉన్నాయి. తెలంగాణ రాజధానిలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన సినీ నేపథ్య గాయకుడు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం విగ్రహ ప్రతిష్టాపన ఆలోచన ఇందుకు మరో ఉదాహరణ. రవీంద్రభారతి ప్రాంగణంలో డిసెంబర్ 15న ఈ కార్యక్రమానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. విగ్రహం రవీంద్రభారతి ప్రాంగణంలోకి చేరింది. ముసుగు తొలగించే కార్యక్రమమే మిగిలి ఉంది.

రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దీని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ గాయకుడి బావమరిది, నటుడు సుధాకర్, కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. పర్యాటక్, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా స్థలాన్ని సందర్శించి ఇది ప్రభుత్వ నిర్ణయమని ప్రకటించారు.బాల సుబ్రహ్మణ్యం విగ్రహ ప్రతిష్టాపనపై తెలంగాణవాదుల నుండి గట్టి వ్యతిరేకత కనబడుతోంది. తెలంగాణలోని సినీ అభిమానులు మాత్రం కళలకు ప్రాంతీయత లేదని వ్యతిరేకతను తప్పుపడుతున్నారు. ఈ రకంగా విగ్రహ ఏర్పాటుపై రెండు రకాల అభిప్రాయాలు వినవస్తున్నాయి. అయితే ఉద్యమ కాలంలో నిర్మించిన ఓ తెలంగాణ సినిమాలో తెలంగాణ అనే పదంతో కూడిన పంక్తి ఉన్నందున ఆ పాట పాడడానికి ఆ గాయకుడు నిరాకరించాడని ఓ వాదన వినిపిస్తోంది. అదే నిజమైతే బాల సుబ్రహ్మణ్యం తెలంగాణను వ్యతిరేకించినట్లే. ఆయన అభిమానులైనా ఈ విషయాన్నీ తీవ్రంగా తీసుకోవాలి. మరోవైపు వద్దు వద్దన్నా మొండిగా ఏర్పాటుకు సిద్ధపడడం ఆక్షేపణీయమే. నిలదీస్తున్న తెలంగాణవాదులకు సంతృప్తికరమైన సమాధానం చెప్పకుండా కమిటీ సభ్యులు జారుకుంటున్నారు. ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉందని ప్రజల అభీష్టాన్ని ఇలా పక్కన పెట్టడం పద్ధతి కాదు.బలవంతంగా విగ్రహం పెట్టి సాధించేదేమిటి? హైదరాబాద్‌పై తమ పెత్తనం తగ్గలేదని రుజువు చేసుకునే ఆంధ్రుల పన్నాగమేనా ఇది అని అనుకోవలసి వస్తుంది. మరోవైపు చూస్తే ప్రపంచ స్థాయి కంపెనీల రాకతో తెలంగాణ రూపురేఖల్లో మార్పు వస్తోంది. దాని ప్రభావం తప్పకుండా ప్రాంత అస్తిత్వంపై పడుతుంది. ఇతర రాష్ట్రాల, విదేశీయుల ఆస్తులు ఇక్కడ పెరిగిపోతున్నాయి. వారితో స్థానికులు పోటీ పడలేని స్థితి వస్తుంది. మంచికో చెడుకో హైదరాబాద్ విశ్వనగరంగా మారుతోంది. అది కేవలం తెలంగాణ ప్రజల సొత్తు కాదు అనే రోజులు వస్తున్నాయి. హైదరాబాద్‌లో ఇది ఉండాలి, అది ఉండొద్దు అనేందుకు గొంతు సరిపోని కాలం వచ్చింది. పాలకులు ఆ వైపు ఉంటే ఇంకేమి చేయలేని స్థితి ఇది. తరం మారుతున్నది కాబట్టి తెలంగాణ ప్రజల ఆలోచన సరళి కూడా మారిపోతోంది. జరిగేది జరగని అనే నిర్లిప్తతలో వారు పడిపోయినట్లున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ హమారా హై అనే గొంతులకు బలం చేకూర్చవలసిన అవసరం ఎంతో ఉంది.

పిడుక్కీ,బియ్యానికీ సుంకాల మంత్రమే!

న్యూఢిల్లీ,ఇతర దేశాలను దారికి తెచ్చుకునే విషయంలో అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్‌కు తెలిసింది ఒక్కటే.. భారీ సుంకాలు విధించడం. అంతకుమించి దౌత్యమార్గంలో చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం కనుక్కుందామనే ఆలోచనే ఆయనకు రాదనడానికి తాజా ఉదాహరణ భారత్ నుంచి తమ దేశానికి ఎగుమతి అవుతున్న బియ్యంపై అధిక సుంకాలు విధిస్తామని బెదిరింపులకు పాల్పడటం. రష్యానుంచి చౌకగా చమురు కొనుగోలు చేస్తూ, పరోక్షంగా ఉక్రెయిన్‌తో యుద్ధానికి రష్యాకు ఆర్థిక వనరులు సమకూర్చి పెడుతోందన్న నెపంతో భారత్‌పై ఇప్పటికే అమెరికా 50 శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. తాజాగా ట్రంప్ మరోసారి కన్నెర్ర చేయడానికి కారణం.. భారత్ నుంచి దిగుమతి అవుతున్న బియ్యంవల్ల తమ రైతులు పండిస్తున్న సరకుకు గిరాకీ ఉండటం లేదని. అసలు ఇదంతా ఎలా మొదలైందంటే, మొన్న ట్రంప్ మహాశయుడు వ్యవసాయం, వ్యవసాయాధారిత పరిశ్రమల స్థితిగతులపై శ్వేతసౌధంలో ఓ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆ భేటీలో ఎవరో ఒక ప్రతినిధి లేచి భారతీయ వ్యాపారులు తమ బియ్యాన్ని అమెరికా మార్కెట్ లోకి కుమ్మరిస్తున్నారని, ఇలా దిగుమతి అవుతున్న బియ్యానికి పన్ను మినహాయింపులు కూడా లభిస్తున్నాయని ఫిర్యాదు చేశారు.ఇంకేముంది.. ట్రంప్ మరోసారి భారత్‌పై తన అక్కసు వెలిగక్కుతూ, బియ్యం దిగుమతులను అడ్డుకునేందుకు సుంకాల మోత మోగిస్తానంటూ వీరంగం వేశారు. ప్రపంచంలోనే బియ్యం ఎగుమతి చేసే దేశాల్లో భారత్ ప్రథమ స్థానంలో ఉంది. అమెరికా సహా అనేక దేశాలకు ఏటా కోట్లాది మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేస్తూ ఉంటుంది.భారత్ కాకుండా థాయ్‌లాండ్, చైనా, ఇండొనేసియా వంటి దేశాలు కూడా అమెరికాకు బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నాయి. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే బియ్యంలో సింహభాగం బాసుమతి బియ్యమే. బిర్యానీ తయారీలో ఉపయోగించే బాసుమతి బియ్యాన్ని పండించడంలో భారత్ పెట్టింది పేరు. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో భారత్ 337 మిలియన్ డాలర్ల విలువగల 2.75 లక్షల మెట్రిక్ టన్నుల బాసుమతి బియ్యాన్ని అమెరికాకు ఎగుమతి చేసింది.బాసుమతియేతర బియ్యాన్ని మాత్రం 61 వేల మెట్రిక్ టన్నులే ఎగుమతి చేసింది. ఒకవేళ ట్రంప్ నిజంగానే భారత్ బియ్యం ఎగుమతులపై సుంకాలు విధించిన పక్షంలో నష్టపోయేది అక్కడి వినియోగదారులే. ఎందుకంటే, భారత్ నుంచి బాసుమతి బియ్యం ఎగుమతులు ఆగిపోతే, అధిక ధరలు వెచ్చించి పాకిస్తాన్ వంటి ఇతర దేశాలనుంచి కొనుగోలు చేయవలసి వస్తుంది. ఇక అమెరికాలో పండే సాధారణ రకం బియ్యం నాణ్యతలో మన బియ్యం ముందు తీసికట్టే. ఇక్కడ గమనించవలసిన మరొక విషయమేమిటంటే, అమెరికాకంటే పశ్చిమాసియా దేశాలకే భారత్ అధిక మొత్తంలో బియ్యాన్ని ఎగుమతి చేస్తోంది. మన బియ్యం ఎగుమతుల్లో అమెరికా వాటా మూడు శాతం మాత్రమే. ఇవన్నీ అగ్రరాజ్యాధిపతికి తెలియవని అనుకోలేం. అమెరికా రైతుల్లో అధిక సంఖ్యాకులు ట్రంప్ మద్దతుదారులనేది బహిరంగ రహస్యం.వారికి ఊరట కలిగించేందుకు కంటితుడుపుగా ఆయన భారత్ పై ఆగ్రహం నటించి ఉండవచ్చుననే వాదన వినబడుతోంది.ఇటీవల పుతిన్ భారత్‌కు రావడం, ఆయనకు ఇక్కడ ఘన స్వాగతం లభించడం కూడా ట్రంప్ కడుపుమంటకు కారణం కావచ్చు. పిడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రం అన్నట్లు ట్రంప్ ప్రతి విషయానికీ సుంకాల అస్త్రమే సంధించాలనుకుంటున్నారు. సుంకాలతోటే అందరినీ దారికి తెచ్చుకోవాలనుకుంటున్నారు. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టారీతిన సుంకాలు విధించడాన్ని కింది కోర్టులు తప్పుపట్టినా, ఆయన వైఖరిలో మార్పు రావడం లేదు సరికదా, సుప్రీం కోర్టులో తనదే గెలుపనే ధీమాతో ఉన్నారు. సర్వోన్నత న్యాయస్థానంలోనూ ఓడిపోతే ప్రపంచ దేశాలముందు తన పరువేం గాను అనే స్పృహ ఆయనకు కలగకపోవడమే విచిత్రం. సుంకాల బూచిని చూపి రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలువరించినట్లే బియ్యం ఎగుమతుల విషయంలోనూ భారత్ కు ముకుతాడు వేయొచ్చన్నది ట్రంప్ ఎత్తుగడ. వాణిజ్య ఒప్పందానికి సంబంధించి ప్రస్తుతం భారత్‌లో అమెరికా బృందం చర్చలు జరుపుతోంది. ఈ నేపథ్యంలో బియ్యంపై సుంకాల విషయంలో ట్రంప్ తాటాకు చప్పుళ్లకు భారత్ బెదరదనే విషయాన్ని విస్పష్టంగా చెప్పవలసిన అవసరం ఉంది.

చైనా సరిహద్దు వెంట ఘోర రోడ్డు ప్రమాదం

న్యూఢిల్లీ,దేశంలో ప్రతిరోజు రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా అరుణాచల్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఇండో – చైనా సరిహద్దు వెంబడి ఉన్న హుయులియాంగ్ – చగ్లగామ్ రహదారిపై ఈ ఘటన జరిగింది. అస్సోంలోని టిన్సుకియా జిల్లాకు చెందిన రోజు వారి కూలీలను తీసుకువెళ్తున్న ఓ ట్రక్కు మార్గమధ్యలో ఈ ప్రమాదానికి గురైనట్లు తెలుస్తుంది. ఈ ప్రమాదంలో ట్రక్కులో ఉన్న 22 మంది కూలీలు చనిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని సహాయకచర్యలు చేపట్టారు. వాస్తవానికి ఈ ఘటన సోమవారం అంటే మూడు రోజుల క్రితం జరిగింది. ఈ ప్రమాదం నుంచి ఓ కార్మికుడు గాయాలతో బయటపడి పట్టణానికి చేరుకున్నాడు. అతడు ఇచ్చిన సమాచారం వల్లనే ఈ విషాద ఘటన గురించి పోలీసులకు తెలిసింది. గాయపడ్డ ఆ కార్మికుడి మెరుగైన చికిత్స కోసం అస్సాంకు తరలించారు. ప్రమాద ఘటన గురించి అంజావ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ మిల్లో కొజిన్ ధృవీకరించారు. ప్రమాదంపై మాట్లాడుతూ.. ఈ ఘటన అంతర్జాతీయ సరిహద్దుకు 45 కిలోమీటర్ల దూరంలో, సముద్ర మట్టానికి దాదాపు 10 వేల అడుగుల ఎత్తులో ఉందన్నారు. ఇప్పటి వరకు 17 మృతదేహాలను వెలికి తీసినట్లు తెలిపారు. రెస్క్యూ టీమ్ సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మిలో కొజిన్ వెల్లడించారు.

బంగారం, వెండి ధరల దూకుడు

న్యూఢిల్లీ,దేశీయంగా బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. వెండి దూకుడు మామూలుగా లేదు. కిలో వెండి ధర రూ.1,95,400 మార్కును చేరుకొని రూ.2 లక్షల దిశగా దూసుకెళు తోంది.అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర కోత పెట్టడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో వీటి ధరలు పెరిగాయి. మార్కెట్ అంచనాలకు అనుగుణంగా రేట్లలో కోత ఉన్నప్పటికీ.. భవిష్యత్ వడ్డీ రేట్ల కోతపై అనిశ్చితి కొనసాగుతోంది.

చర్చనీయాంశంగా మారిన కవిత తీరు..

హైదరాబాద్, అక్క మొదట అలిగినట్లు చేసింది. ఆ తర్వాత రచ్చకెక్కింది. అట్టముక్కతో కొట్టినట్లు చేసి..ఇప్పుడు ఏకంగా బడిత పూజ మొదలు పెడుతోంది. భారీ డైలాగులు పేల్చుతూ ఎవరి గుండెల్లో గునపం దింపాలో దింపేస్తోంది. బీఆర్ఎస్ లీడర్లను టార్గెట్ చేస్తూ గులాబీ దళంలో గుబులు పుట్టిస్తోంది. ఇక చూసి చూసి భరించలేక.. కారు పార్టీ లీడర్లు కూడా ఈట్ కా జవాబ్ పత్తర్ సే దేంగే అంటున్నారు. పెద్ద సార్ కూతురని కూడా చూడకుండా నీ వల్లే పార్టీ పుట్టి మునిగిందని రివర్స్ అటాక్ చేస్తున్నారు. కారు వర్సెస్ కవిత ఫైట్ ఎటు వెళ్తోంది? జాగృతి టార్గెట్ బీఆర్ఎస్సేనా? ఇక బీఆర్ఎస్‌కూ జాగృతే టార్గెట్‌గా మారిందా..?నాన్న దేవుడు. అన్నతో నో ఇష్యూస్.. హరీష్ తోనే అసలు సమస్య అంటూ మొదట్లో ప్రకటన చేసింది. ఆ తర్వాత కొద్దిరోజులు సైలెంట్ గా ఉన్న కవిత ఫ్పుడు జనం బాటలో తన గేర్ మార్చేస్తుంది. రోజురోజుకూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, మాజీ మంత్రులను టార్గెట్ చేస్తూ హీట్ పుటిస్తోంది. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా జిల్లాల పర్యటన చేస్తున్న కవిత..ఎక్కడికి వెళ్లినా పదేళ్ల బీఆర్ఎస్ పాలన మొత్తం అవినీతిమయం, అసలు అభివృద్ధి ఏం జరిగింది అనేలా మాట్లాడుతూ వస్తున్నారు.మొన్నటి వరకు సుతిమెత్తంగా, సున్నితంగా విమర్శిస్తూ వచ్చిన కవిత..ఇప్పుడు ఏకంగా ఒక్కో ఎమ్మెల్యేను, మాజీమంత్రిని పర్సనల్ గా టార్గెట్ చేస్తూ అవినీతి ఆరోపణలు.. కబ్జాలు అంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. చివరకు కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గానికి వెళ్లి కూడా బీఆర్ఎస్ లీడర్లను టార్గెట్ చేస్తుండటం చర్చకు దారితీస్తోంది. ఇదంతా గమనించిన గులాబీ లీడర్లు..కవిత బీఆర్ఎస్ నే టార్గెట్ చేస్తుందని తమపై చేస్తున్న వ్యాఖ్యలకు సైలెంట్ గా ఉంటే ఇంకా వీక్ అయిపోతామనే నిర్ణయానికి వచ్చారట. ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు అవినీతి చేశారంటూ..ఇంటైరెక్టగా గత బీఆర్ఎస్ పాలన అంతా అవినీతిమయమే అనేలా కవిత ఆరోపిస్తుండటం గులాబీ లీడర్లకు అస్సలు మింగుడు పడటం లేదట. దీంతో కవిత వ్యాఖ్యలకు అంతే స్థాయిలో రియాక్ట్ అవ్వాలని డిసైడ్ అవ్వడమే కాదు.. డైరెక్ట్ ఎటాక్ కు దిగారు.

తగ్గేదేలే అంటున్న బీఆర్ఎస్ నేతలు.. ఎదురు దాడి..

కవిత తను పర్యటిస్తున్న నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఉన్నా%ౌ%వారిని పల్లెత్తు మాట అనకుండా తమపైనే విరుచుకుపడటం బీఆర్ఎ నేతలకు మింగుడు పడటం లేదు. మొన్నటివరకు కవితపై బీఆర్ఎస్ నేతలు ఆచితూచి అడుగులు వేశారు. ఎంతైనా తమ అధినేత కూతురు కాబట్టి సంయమనంతో వ్యవహరిస్తూ వచ్చారు. ఇప్పుడు కవిత డోస్ పెంచి వాయిస్ రేజ్ చేస్తుండటంతో బీఆర్ఎస్ లీడర్లు కూడా తగ్గేదేలే అంటున్నారు. మొన్న మాజీమంత్రి జగదీష్ రెడ్డి, ఆ తర్వాత మరో మాజీమంత్రి నిరంజన్ రెడ్డి కవిత ఆరోపణలపై తీవ్రస్థాయిలో ఫైర్ అవ్వగా.. ఇప్పుడు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కవితకు లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చిపడేశారు. కవిత ఏ కేసులో జైలుకు వెళ్లారో మరిచిపోయి ఇలా తమను విమర్శించడం ఏంటని డైరెక్ట్ అటాక్ కు దిగుతున్నారు.

గుట్టు విప్పుతానంటూ కవితకు సీరియస్ వార్నింగ్..

తనపై కవిత ఆరోపణలు చేయడంతో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఘాటుగా రియాక్ట్ అయ్యారు. కవిత చరిత్ర ఏంటో తనకు బాగా తెలుసన్న ఆయన.. ఇంకా ఎక్కువ మాట్లాడితే గుట్టు విప్పుతానంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చి పడేశారు. కవిత పెంపుడు కుక్కకు విస్కీ అని పేరు పెట్టుకున్న కవిత.. పదేళ్లలో ఏమేం చేసిందో అంతా తెలుసంటూ ఘాటుగా రియాక్ట్ అయ్యారు. అయితే కవిత బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేసినా..గులాబీ లీడర్లు కవితకు కౌంటర్ గా మాట్లాడినా..నువ్వు అవినీతి చేశావంటే నువ్వు దోచుకున్నావంటూ ఆరోపణలు గుప్పించుకోవడం ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. ఈ రెండు వర్గాలు కేసీఆర్ హయాంలో నిర్ణయాలపైనే అలిగేషన్స్ చేసుకుంటుడంతో..ఇండైరెక్ట్ గా గులాబీ బాస్ కు తలనొప్పిగా మారిందన్న టాక్ నడుస్తోంది.

రెడీ కావాల్సిందే !

అమరావతి,రాజకీయాల్లో ఎన్నో జరుగుతాయి. అన్ని చోట్లా జరుగుతాయి. కానీ ఏపీ రాజకీయమే సెపరేట్ గా సాగుతుంది. ఇక్కడ అంతా ఒక ప్రత్యేకంగా చూడాలి. ఓటర్లు అలాగే విలక్షణమైన తీర్పులు ఇస్తూంటారు. రాజకీయ పార్టీలు నాయకులు అలాగే కొత్తగా ఆలోచిస్తూంటారు అందుకే దేశంలోనే ఏపీ ఒక స్పెషల్ అని చెప్పాలి. దేశమంతా ఇదిరాగాంధీని ఓడిస్తే ఏపీ జనాలు నెత్తిన పెట్టుకున్నారు. అదే దేశమంతా రాజీవ

సిఎం సహాయనిధి పంపిణీలో కొత్త రికార్డు

హైదరాబాద్,తెలంగాణలో ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డు సృష్టించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లలో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎప్పుడూ లేని స్థాయిలో వైద్య సహాయం అందింది. 2023 డిసెంబర్ 7 నుంచి 2025 డిసెంబర్ 6 వరకు మొత్తం 3,76,373 మంది లబ్దిదారులకు రూ. 1,685.79 కోట్ల సహాయం అందజేశారు. గతంలో 2014 నుంచి 2024 వరకు సంవత్సరానికి సగటున రూ. 450 కోట్లు మాత్రమే సహాయ నిధి ద్వారా పంపిణీ కాగా, ప్రస్తుత ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో సగటున సంవత్సరానికి రూ. 850 కోట్ల మేర నిధులు వెచ్చించడం గమనార్హం.ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రజలకు రెండు విధాలుగా వైద్య సహాయం అందుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స కోసం ముందుగానే ఖర్చు భరించే లెటర్ ఆఫ్ క్రెడిట్ విధానం ద్వారా 27,421 మంది లబ్దిదారులకు రూ. 533.69 కోట్ల సహాయం అందింది. నిమ్స్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రి వంటి వైద్య కేంద్రాల్లో ఈ సహాయం నేరుగా చికిత్స ఖర్చులకు ఉపయోగపడింది. మరోవైపు ప్రైవేటు లేదా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారు ఖర్చులు చెల్లించిన అనంతరం తిరిగి పొందే రీయింబర్స్‌మెంట్ విధానం ద్వారా 3,48,952 మందికి రూ. 1,152.10 కోట్లు అందజేశారు. ప్రజలు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన వైద్యం పొందేలా ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా నిమ్స్‌లో ఎక్కువగా లెటర్ ఆఫ్ క్రెడిట్ కేసులు మంజూరవడం ద్వారా పేదలకు అత్యాధునిక చికిత్స అందుబాటులోకి వచ్చింది. ఈ మొత్తం ప్రక్రియలో దళారీల పాత్ర లేకుండా దరఖాస్తులను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో స్వీకరిస్తున్నారు. ఆధార్ ధృవీకరణ తర్వాత లబ్దిదారుడి పేరు, బ్యాంక్ ఖాతా వివరాలతో చెక్కులు జారీ చేస్తుండటంతో పారదర్శకత మరింత పెరిగింది.తెలంగాణ రాష్ట్ర నివాసితులు, సాధారణంగా సంవత్సరానికి రూ. 1.60 లక్షల లోపు కుటుంబ ఆదాయం ఉన్నవారు ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్హులు. ప్రజాప్రతినిధుల సిఫారసుతో అధికారిక అఓఖీఈ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఆరోగ్యశ్రీ పథకానికి అదనంగా పనిచేస్తున్న ఈ సహాయ నిధి, అనారోగ్యం కారణంగా ఆర్థికంగా కుంగిపోయే కుటుంబాలకు పెద్ద భరోసాగా మారింది. గతంతో పోలిస్తే నాలుగింతల స్థాయిలో నిధులు వెచ్చించడం ద్వారా ప్రజల ఆరోగ్యం ప్రభుత్వం కోసం ఎంత కీలకమో ఈ గణాంకాలే స్పష్టంగా చూపిస్తున్నాయి.

భవానీ భక్తులతో ఇంద్రకీలాద్రి కిటకిట

విజయవాడ,విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం భవానీ భక్తులతో కిటకిటలాడింది. భవాని దీక్ష విరమణలు గురువారం నుంచి 5 రోజులపాటు కొనసాగనున్నాయి. దీంతో వారంతా భారీగా తరలివస్తున్నారు. ఇంద్రకీలాద్రిలో 11వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు భవానీ దీక్ష విరమణలు ఉండటంతో దేవస్థానం పాలక మండలి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అగ్ని ప్రతిష్టాపనతో ఇరుముడులు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. హోమ గుండాలను దుర్గగుడి ఈవో, చైర్మన్, ఆలయ స్థానాచారి వెలిగించారు. జై దుర్గా.. జై జై దుర్గా నామస్మరణతో మార్మోగుతోంది ఇంద్రకీలాద్రి. ఈ సందర్భంగా ఆలయ ఈవో శీనా నాయక్, చైర్మన్ బొర్రాగాంధీ మీడియాతో మాట్లాడారు. భవానిల దీక్ష విరమణ సందర్భంగా.. ఇరుముడిని సమర్పించడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి ఏడాది భవానీల సంఖ్య పెరుగుతోందని వివరించారు. ఇరుముడులను సమర్పించడానికి మూడు హోమగుండాలను ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. 41 రోజులపాటు నియమ నిబంధనలు పాటిస్తూ భవానీలు మాలధారణ చేశారని తెలిపారు. భవాని భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు, వెయిటింగ్ హాల్స్, అదనపు పార్కింగ్, 19 ప్రసాదం కౌంటర్లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఎపీ నలుమూలల నుంచి 7 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని చెప్పుకొచ్చారు. లక్షలాదిగా తరలివచ్చే భవానీలకు తాగునీరు, ప్రసాదం కొరత లేకుండా అందించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. 950 మంది క్షురకులు 4,000 మంది పోలీసు సిబ్బంది, 370కు పైగా సీసీ కెమెరాలతో భద్రతను పటిష్టం చేశామని పేర్కొన్నారు. అన్ని అర్జిత సేవలు డిసెంబర్ 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిలిపివేశామని తెలిపారు.గిరి ప్రదక్షిణ మార్గంపై వివరాలను అందించే భవానీ దీక్ష 2025 మొబైల్ యాప్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. 9 కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షిణ ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. భక్తులకు ఎప్పటిక ప్పుడు మానిటరింగ్ చేసే విధంగా కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని అన్నారు. సామాన్య భక్తుడికి పెద్దపీఠం వేశామని .. భవానీల కోసం ఉచిత క్యూలైన్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

మనోడికి తేడాలున్నాయా?

న్యూఢిల్లీ,వందలాది సర్వీసులు ఉన్నట్టుండి రద్దు చేయటం.. గంటల కొద్దీ వాయిదా వేయటం.. ఇలా ఇష్టరాజ్యంగా వ్యవహరించిన ఇండిగో విమానయాన సంస్థ వ్యవహారశైలి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దేశంలోని విమానయాన రంగంలో 63 శాతానికి పైగా వాటా ఉన్న ఇండిగో.. కొత్త నిబంధనల అమలుకు 22 నెలల పాటు గడువు ఇచ్చిన తర్వాత కూడా వాటిని అమలు చేయని బరితెగింపుపై దేశ వ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతుంటే.. అందుకు భిన్నంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నోటి నుంచి అందుకు విరుద్ధమైన వ్యాఖ్యలు రావటమేంటి? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది.తాజాగా ఎన్డీయే ఎంపీలతో జరిగిన సమావేశంలో మాట్లాడిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాటలు కాస్తంత సిత్రంగా ఉండటం గమనార్హం. విమానాల నిర్వహణ లోపాలతో ప్రయాణికులకు ఎలాంటి సమస్యలు తలెత్తవద్దన్న ఆయన.. “చట్టాలు.. నిబంధనలు ఏవైనా సరే వ్యవస్థల్ని సరి చేసేలా ఉండాలే తప్ప.. ప్రజలను వేధించొద్దు” అని పేర్కొనటం దేనికి నిదర్శనం? అన్నదిప్పుడు ప్రశ్న.విమాన విధుల సమయ నియంత్రణ రెండో దశలో కఠిన నిబంధనల కారణంగా.. పైలట్లు.. సిబ్బందిని సర్దుబాటు చేయలేక ఇండిగో చేతులు ఎత్తేసిందనే కన్నా.. కొత్త నిబంధనల్ని నిజాయితీగా అమలు చేయాలన్న ఉద్దేశం ఆ సంస్థకు లేదన్న విషయం చిన్న పిల్లాడికి సైతం అర్థమైన వేళ.. ప్రధాని మోడీ మాత్రం అందుకు భిన్నంగా వ్యాఖ్యలు చేయటం చూస్తే.. తప్పులు చేసినోళ్లను.. దారుణంగా ప్రజల్ని ఇబ్బంది పెట్టిన ఇండిగోను వెనకేసుకొచ్చినట్లుగా మాట్లాడటమా? అన్న విస్మయం వ్యక్తమవుతోంది.ఎన్డీయే ఎంపీల భేటీ అనంతరం ప్రధానమంత్రి మోడీ వ్యాఖ్యల వివరాల్ని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మీడియాకు వెల్లడిస్తూ.. విమాన నిర్వహణ సమస్యల కారణంగా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దన్న ఆయన.. ప్రజలు ఎవరికైనా ఎలాంటి ఇబ్బందులు ఎదరవకూడదని.. నిబంధనలు.. చట్టాలు ముఖ్యమే అయినా అవన్నీ వ్యవస్థల్ని సరి చేసేలా ఉండాలే కానీ ప్రజల్ని వేధించేలా ఉండకూడదని స్పష్టం చేశారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యలు విన్నప్పుడు ఇండిగో ఇష్యూలో ఆయన ఆలోచనలకు.. విమానయాన శాఖ మంత్రి కం మనోడు, తెలుగోడు (రామ్మోహన్ నాయుడు) ఆలోచనల్లో తేడా

లక్ష్యం రూ.3 లక్షల కోట్లు ఒప్పందాలు రూ.5.75 లక్షల కోట్లు...

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా కందుకూరు లోని ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ బోసిపోయింది. సమ్మిట్ నిర్వహణ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు నెలల నుంచి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నా ఆశించిన ఫలితం కన్పించలేదు. దావోస్ లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సును పరిగణనలోకి తీసుకుని, తెలంగాణ ను 2047 నాటికి దేశంలోనే నెంబర్ వన్ గా తీర్చిదిద్దేందుకు దార్శనిక పత్రం కూడా రూపొందించారు. తెలంగాణ రాష్ట్రాన్ని మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు విజన్ డాక్యుమెంట్ ను రూపొందించారు. ఇంతటి మహోన్నత లక్ష్యంతో నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్ ను సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు హాజరవుతారని ప్రకటించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ లో ప్రభుత్వ పెట్టుబడుల లక్ష్యం రూ3 లక్షల కోట్లు కాగా ఒప్పందాలు మాత్రం రూ. 5.75 లక్షల కోట్లు వచ్చాయని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇందులో ఎక్కువగా తెలంగాణ కు చెందిన కంపెనీలే ముందుకు వచ్చి పెట్టుబడులు పెట్టాయని అంతర్జాతీయ కంపెనీలు ఆశించిన స్థాయిలో రాలేదని అంటున్నారు.

పెట్టుబడి లక్ష్యం ఆకాశంలోఒప్పందాలు మాత్రం నేలమీద!

విద్యుత్ సెక్టార్ రంగంలో రెండు రోజుల గ్లోబల్ సమ్మిట్ లో రూ.3,24,698 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు జరగ్గా, 1,40,500 మంది యువతకు ఉపాధి లభించనున్నదని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఒప్పందాలు జరిగాయి. ఇందులో సోలార్, పంప్డ స్టోరేజీ, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్, ఈ మెథనాల ప్లాంట్, 2జీ ఎథనాల్ ప్రాజెక్టు, కంప్రెస్డు బయో గ్యాస్, ప్రొడక్షన్ ఆఫ్ గ్రీన్ హైడ్రోజన్, మినరల్ ప్లాంట్, రైల్వేలతో పాటు గనుల రంగంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈ ఒప్పందాలు జరిగినట్లు పేర్కొన్నారు. అగ్రిమెంట్లు కుదుర్చుకున్న వాటిలో కనిష్ఠంగా రూ. 1,250 కోట్లు మొదలు గరిష్ఠంగా రూ. 50వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్నాయి. మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కే.జానారెడ్డి సంబంధీకులకు చెందిన ఆస్తా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, ఏఎం గ్రీన్ ఇండియా కూడా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ఆస్తా గ్రీన్ ఎనర్జీ పంప్డ స్టోరేజీ ప్లాంట్ లో రూ. 4,650 కోట్ల అంచనా వ్యయంతో 750 మెగా వాట్లతో నిర్మాణం చేయనున్నది. ఏఎం గ్రీన్ ఇండియా రూ. 8వేల కోట్లతో ఈ మెథనాల్ ప్రాజెక్టు చేపట్టనున్నట్లు ప్రకటించారు. అయితే కోట్లతో మరో 2జీ ఈ మెథనాల్ ప్రాజెక్టు చేపట్టనున్నట్లు ప్రకటించారు. అయితే పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ రూ. 50వేల కోట్లు, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ రూ. 31,198 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చాయి.

అంతా అస్పష్టం– అనుమానాలు అనంతం

ఈ పెట్టుబడులు ఎప్పటిలోగా పెడతారు, ఏ ప్రాంతంలో పెడతారు అనేది మాత్రం స్పష్టం చేయలేదు. గడువు విధించకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ కంపెనీలలో సుమారు ఒక లక్షా నలభై వేల మందికి ఉపాధి లభిస్తున్నదని పేర్కొన్నారు. సంఘటిత రంగంలో ఎంత మంది, అసంఘటిత రంగంలో ఎంత మందికి ఉపాధి లభిస్తుందని వెల్లడించలేదు. ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్, డేటా సెంటర్లు, ఔషధ రంగం, క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్ వంటి విభాగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగాలు రానున్నాయంటున్నారు. ఇన్‌ఫ్రాకీ డిసి పార్క్‌లో 150 ఎకరాల్లో 1 గిగావాట్ సామర్థ్యం గల భారీ డేటా పార్క్ అభివృద్ధి చేపట్టుండుకు రూ. 70 వేల కోట్ల పెట్టుబడులతో ముందుకొచ్చింది. జెసీకే ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ రూ.9 వేల కోట్ల పెట్టుబడితో పెద్ద స్థాయి డేటా సెంటర్ల నిర్మాణం చేపడుతోంది. దీంతో సుమారు 2 వేల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. ఏజీపీ గ్రూప్ మొత్తం రూ.6,750 కోట్ల పెట్టుబడితో 1 గిగావాట్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. బయోలాజికల్ ఈ లిమిటెడ్ (బీఈ) టీకాలు, పరిశోధన%–%అభివృద్ధి, తయారీ సేవల విస్తరణలో భాగంగా రూ.3,500 కోట్ల కొత్త పెట్టుబడి ప్రకటించింది. గత పెట్టుబడితో కలిపి మొత్తం రూ.4 వేల కోట్లు అవుతుంది. 3 వేలకు పైగా ఉద్యోగాలు రాబోతున్నాయి. ఫెర్టిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.2 వేల కోట్ల పెట్టుబడితో తెలంగాణలో అధునాతన ఆహారం%–%వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయనుంది. దీంతో 800 పైగా ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. స్థిర వ్యవసాయానికి అవసరమైన పోషకాలు, బయో ఉత్ప్రేరకాలు తయారీకి రూ.200 కోట్ల పెట్టుబడి ప్రతిపాదించారు.

‘గ్లోబల్’ అని చెప్పినా అంతర్జాతీయ ముద్ర లేదు

హైదరాబాద్ మహా నగరంతో పాటు తెలంగాణ ను అంతర్జాతీయ ముఖ చిత్రంలో మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావడంతో పాటు పెట్టుబడులను ఆకర్షించేందుకు గ్లోబల్ సమ్మిట్ కార్యాక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులు హాజరయితే మరో విధంగా ఉండేదని అభిప్రాయాలు పారిశ్రామిక వేత్తలు వ్యక్తం చేస్తున్నారు. దేశీయ పారిశ్రామిక దిగ్గజాలను కూడా ఆకర్షించడంలో రేవంత్ సర్కార్ విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెండో రోజు కార్యక్రమంలో మహీంద్రా గ్రూపు అధినేత ఆనంద్ మహీంద్రా, ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరు సుబ్బారావు, కాలిఫోర్నియా ఎకనామిక్ ప్రొఫెసర్ కార్తీక్ మురళీధరన్, సినీ ప్రముఖులు చిరంజీవి, దిల్ రాజు, అల్లు అరవింద్ వంటి వారు మాత్రమే కలిశారు.44 దేశాల నుంచి 154 ప్రతినిధులు వస్తారని చెప్పిన ప్రభుత్వం, హైదరాబాద్? హోటళ్లలోని గదులన్నీ బుక్? చేసి బొక్కబోర్లాపడింది. ఏ దేశం నుండి ఎవరూ రాలేదు. చివరికి కేంద్ర మంత్రులు కూడా రాకపోవడం రాష్ట్ర ప్రభుత్వానికి అవమానకరంగా మారింది. హాజరైన వారి లిస్ట్‌లో పెద్ద అంతర్జాతీయ కార్పొరేట్ CEOలు, గ్లోబల్ ఇన్వెస్టర్లు, వరల్డ్ లెవల్ ఇండస్ట్రీ లీడర్లు కనిపించలేదు. టాప్ మల్టీనేషనల్ కంపెనీలు (Google, Amazon, Microsoft, Tesla, Meta, Samsung, Foxconn, Shell, GE, Siemens లాంటి) ఏదీ కనబడలేదు. గ్లోబల్ ఫైనాన్షల్ సంస్థలు, పెద్ద ఫండ్ మేనేజర్లు, సావరిన్ వెల్త్ ఫండ్స్.. ఏవీ కూడా ప్రధానవేదికపై కనిపించలేదు.

రెండో రోజు హాజరైనవారు:

- ఆనంద్ మహీంద్రా (ఇండియన్)
- దువ్వూరి సుబ్బారావు (ఇండియన్, మాజీ RBI గవర్నర్)
- కార్తీక్ మురళీధరన్ (అకాడెమిక్)
- టాలీవుడ్ ప్రముఖులు – చిరంజీవి, దిల్ రాజు, అల్లు అరవింద్

వీరిలో ఎవరూ ఇంటర్నేషనల్ ఇండస్ట్రీ ఇన్వెస్టర్ కమ్యూనిటీలో ఉన్న వ్యక్తులు కాదు. ఫ్యూచర్ సిటీలో తెలంగాణ ప్రభుత్వం భారీ ఆశలతో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ అసలు లక్ష్యానికి దగ్గరపడకపోగా, సుదూరంలోనే ఆగిపోయిందనే విమర్శలు మొదలయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డి గత రెండు నెలలుగా ఈ ఈవెంట్‌పై వ్యక్తిగతంగా దృష్టి పెట్టినా, దావోస్ స్టైల్ విజన్, 2047 Telangana Blueprint, మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ టాక్.. అంతా బూడిదలో పోసిన పన్నీరులా మారిందని ప్రభుత్వవర్గాలే పెదవి విరుస్తున్నాయి.

ఐదేళ్ల జగన్ పాలనలో సర్వనాశనం



అమరావతి, వైకాపా ఐదేళ్ల పాలనలోఅభివృద్ధి ఆగిపోవడమే గాకుండా ఎపి బ్రాండ్ పూర్తిగా దెబ్బతిందని, ఆదాయం తగ్గిపోయిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అన్ని రంగాలు పూర్తిగా ధ్వసం అయ్యాయని, వ్యవస్థలు దెబ్బతిన్నాయని అన్నారు. వైకాపా పాలన దెబ్బకు ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ దెబ్బతిన్నది. ఆ పార్టీ చేసిన దారుణాల వల్ల కొన్ని కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయి. ఇప్పుడు అన్ని వ్యవస్థలను చక్కదిద్దుతూ అభివృద్ధి కొనసాగిస్తున్నాం అని వివరించారు. విధ్వంసమైన ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను మళ్లీ గాడిలో పెడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ అనేక విజయాలను చవిచూసిందని.. కానీ 2024 విజయం.. నమ్మకం, విశ్వాసం మీద వచ్చిందని తెలిపారు. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామన్నారు. పరీక్ష రాసినప్పుడు పిల్లలు ఎంత టెన్షన్‌గా ఉంటారో తాము అంతే టెన్షన్‌గా ఉంటామని చెప్పుకొచ్చారు. జీఎస్డీపీ విషయంలో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటున్నామని తెలిపారు.ఈ రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టగలు గుతారా? అనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని.. అయితే ప్రస్తుత పరిస్థితి చూసి పారిపోమని ప్రజలకు హామీ ఇచ్చినట్లు తెలిపారు.ప్రస్తుతం ఓ వైపు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూ.. ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం కేంద్ర పథకాల్లో అవకతవకలకు పాల్పడిందని, కేంద్ర నిధులను ఇతర పథకాలకు మళ్లించిందని అన్నారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల కోసం గతంలో రూ.9వేల కోట్లు ఖర్చు చేశారు. ఇప్పుడు విద్యుత్ ఛార్జీలు పెంచకుండానే విద్యుత్ రంగాన్ని సమర్థంగా నిలబెడుతున్నాం అని అన్నారు. వచ్చే ఏడాది కూడా విద్యుత్ రంగంలో సమర్థత పెంచుకుంటాం. సాగు నీటి పంట గుంటలు తవ్వడంతోపాటు, చెక్ డ్యామ్‌లు కట్టాం. ఇంగ్లీష్ మీడియం పేరుతో విద్యా వ్యవస్థలో కూడా గతంలో డ్రామాలు చేశారు. విద్యా వ్యవస్థలోని బిల్లులు అన్నీ పెండింగ్‌లో పెట్టారు. వైకాపా ప్రభుత్వం 85 లక్షల టన్నుల చెత్తను వారసత్వంగా ఇచ్చి వెళ్లిందని చంద్రబాబు దుయ్యబట్టారు.ప్రతి త్రైమాసిక, ఆర్థిక ఏడాది రాష్ట్ర స్థూల ఉత్పత్తి పర్యవేక్షిస్తున్నాం. ప్రజల కోసం ఎంత కష్టమైనా సరే బాధ్యత తీసుకొని అభివృద్ధి చేస్తాం. ఆస్తులు, భవిష్యత్ ఆదాయాన్ని తాకట్టు పెట్టి గతంలో అప్పులు తెచ్చారు. మూలధన వ్యయం చేయకపోవడంతో గతంలో ప్రాజెక్టులు ముందుకెళ్లలేదు. కూటమి అధికారంలోకి వచ్చాకే స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రాజెక్టులపై మూలధన వ్యయం పెంచి ప్రాజెక్టులు చేపట్టాం. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రజల చేతుల్లోకి పాలన తీసుకెళ్లాం. వైకాపా హయాంలో పీపీఏల రద్దుతో విద్యుత్ వాడకుండానే రూ.9 వేల కోట్లు వ్యయం చేశారు. కక్షపూరిత రాజకీయాలతో గత పాలకు ప్రజాధనాన్ని వృథా చేశారు. 2014-19 మధ్య 13.5 శాతంగా వృద్ధిరేటు ఉండేది. 2019-24 మధ్య కాలంలో అది 10.32 శాతానికి పడిపోయింది. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సంస్కరణలు తెచ్చాం. పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం అని చంద్రబాబు తెలిపారు. నాడు సూపర్ సిక్స్ తీసుకువచ్చామని... అయితే అభివృద్ధికి నిధులు లేవన్నారు. క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్ బాగా తగ్గి అభివృద్ధి లేకుండా పోయిందని వెల్లడించారు. తరువాత అన్ని వ్యవస్థలను గాడిన పెట్టామన్నారు. క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్‌ను బాగా పెంచామని.. సుపరిపాలనకు టెక్నాలజీని అభివృద్ధి చేశామని అన్నారు. ఆగిపోయిన స్కీంలు అన్నింటినీ తిరిగి ప్రారంభించామని ముఖ్యమంత్రి చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమపాళ్లలో చేపట్టామన్నారు. 18 నెలలుగా ప్రతి గంట, ప్రతి క్షణం కష్టపడ్డామన్నారు. 93 స్కీంలను మరలా రివైవ్ చేసినట్లు తెలిపారు. రూ.9000 కోట్ల సోలార్ విండ్ రెన్యూవబుల్ ఎనర్జీ కింద నాటి ప్రభుత్వం డబ్బులు పెంచేసిందని విమర్శించారు. కరెంటు ఛార్జీలు పెంచకుండా వ్యవస్థను నిలబెట్టామన్నారు. కరెంటు ఛార్జీలు ఈ ఏడాది కూడా పెంచమని... వచ్చే ఏడాది పెంచుకుంటామని సీఎం వెల్లడించారు. రాష్ట్రంలో చాలా చోట్ల గ్రౌండ్ వాటర్ పెంచగలిగామన్నారు. ఏపీ బ్రాండ్ రాష్ట్రంలో పూర్తిగా దెబ్బతిన్నదని.. పరిశ్రమలను వెళ్లగొట్టారని మండిపడ్డారు. విద్యా వ్యవస్థలో ఆంగ్ల మాధ్యమం అని చెప్పి డ్రాపవుట్లను పెంచారన్నారు. ఆలిండియా లెవల్‌లో టాప్ 5 ÷ఉన్న ఎడ్యూకేషన్ సిస్టంను టాప్ త్రీ లేదా వన్‌కు తీసుకువస్తామని స్పష్టం చేశారు. భూగర్భ జలాలను పెంచడం కూడా చేశామన్నారు. ఇటీవల జరిగిన ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పెట్టుబడుల గురించి అందరికీ తెలిసిందన్నారు. జీఎస్డీపీ, తలసరి ఆదాయం ఎలా పెరిగిందో చూస్తే రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతోందని అర్థమవుతోందన్నారు. ప్రజలకు ఈ విషయాలన్నీ తెలియాలనే ఉద్దేశంతో అన్నీ చేస్తున్నామన్నారు. రాష్ట్ర విభజన తరువాత టీడీపీ అయిదేళ్లు అధికారంలో ఉందన్నారు. ఇక్కడ సరాసరి జీఎస్టీ 13.5 శాతం సాధించామని... కేంద్ర జీఎస్డీపీ కన్నా ఎక్కువ సాధించామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక 12.02 శాతం వృద్ధి సాధించామని.... ఆల్ ఇండియా లెవల్‌లో 9.8 శాతంగా ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కాగా.. 2025-26 తొలి అర్ధ సంవత్సరం అలాగే 2వ త్రైమాసికం ఫలితాలను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. స్థిర ధరల వద్ద నమోదైన ఆర్థిక వృద్ధి, రాష్ట్ర స్థూల ఉత్పత్తి, గ్రాస్ వాల్యూ అడిషన్, వ్యవసాయం, ఉత్పత్తి, సేవా రంగాలు నమోదు చేసిన వృద్ధి గణాంకాలను విడుదల చేశారు. విభజన వల్ల రాష్ట్రానికి వ్యవస్థీకృతమైన నష్టం జరిగిందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. 2019-24 పాలన వల్ల వ్యవస్థలు డీఫంక్ట్ అయ్యాయని... రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోయిందని తెలిపారు. గత పాలకుల విధ్వంస పాలన వల్ల గ్రోత్ రేట్ తగ్గి రూ.7లక్షల కోట్ల జీఎస్డీపీ

అనంతపురం జిల్లాలో దారుణం

అనంతపురం, అనంతపురం జిల్లాలో దారుణం జరిగింది. కేఎస్ఆర్ జూనియర్ కాలేజీలో నలుగురు బాలికలు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. నలుగురు విద్యార్థినులు వాన్హోల్ తాగి ఆత్మహత్యయత్నం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. నగరంలోని కేఎస్ఆర్ జూనియర్ కళాశాలలో తాడిపత్రి మండలానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన అక్కాచెల్లెళ్లు చదువుతున్నారు. విద్యార్థినుల గురించి తల్లిదండ్రులకు వార్డెన్ వసంత ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థినులు భయపడి ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయం గమనించిన వార్డెన్ వెంటనే వారిని చికిత్స నిమిత్తం అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఎమర్జెన్సీ వార్డులో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం బాలికల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకుని ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు విద్యార్థినుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు చేరుకున్నారు. బాలికల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అయితే, ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను వెల్లడించేందుకు నిరాకరిస్తున్నారు కుటుంబ సభ్యులు. ఈ ఘటనతో మిగతా విద్యార్థినులు కూడా తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

గోల్డీ హైదర్‌తో మంత్రి లోకేశ్ భేటీ

అమరావతి,కెనడియన్ పెట్టుబడులకు సహకారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. బిజినెస్ కౌన్సిల్ ఆఫ్ కెనడా అధ్యక్షుడు గోల్డీ హైదర్‌తో మంత్రి లోకేశ్ సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాలతో ముందుకెళ్తోందని తెలిపారు. ఏపీలో పారిశ్రామిక పెట్టుబడులకు సహకారం అందించాలని కోరారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో గత 18నెలల్లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.20లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని వివరించారు. 1053 కిలోమీటర్ల సుదూర తీర ప్రాంతం, సువిశాలమైన రోడ్లు, రైలు మార్గాలు, ఆరు ఆపరేషన్ పోర్టులు, ఆరు ఎయిర్ పోర్టులతో విస్తృతమైన కనెక్టివిటీ కలిగి ఉందని తెలిపారు. మరో ఆరునెలల్లో భోగా

వంటింటి సామాన్లతో సిద్ధంగా ఉండండి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మమతా బెనర్జీ మరోమారు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళన చేపడుతోన్న సంగతి తెలిసిందే. ఈసీ 'భాజపా కమిషన్'గా మారిందని, దిల్లీ నుంచి వచ్చిన సూచనల ప్రకారం నడుచుకుంటోందని ఆరోపణలు చేస్తున్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా గురువారం మహిళలను ఉసిగొల్పారు. ఆ సవరణ తర్వాత ఓటరు జాబితాలో పేర్లు తొలగింపునకు గురైతే కిచెన్ టూల్స్‌తో సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్ పేరుతో మీ తల్లులు, సోదరీమణుల ఓట్లను లాక్కుంటారా..? ఎన్నికల సమయంలో దిల్లీ నుంచి పోలీసులను తీసుకువచ్చి మిమ్మల్ని బెదిరిస్తారు. జాబితాలో మీ పేరు లేకపోతే..మీ వద్ద వంటగదిలో వాడే పరికరాలు ఉన్నాయికదా..! వంటచేసేటప్పుడు వాడే ఆ పరికరాలు మీ బలం. మహిళలు ముందుండి పోరాడుతారు. మగవారు వారివెనక ఉంటారు. మహిళలా లేక భాజపానా..? ఎవరు బలవంతులో చూడాలని అనుకుంటున్నాను. నేను లౌకికవాదాన్నే నమ్ముతాను. ఇక్కడి ప్రజలను విభజించేందుకు ఎన్నికల సమయంలో భాజపా డబ్బు వాడి, వేరే రాష్ట్రాల నుంచి మనుషుల్ని దింపుతుంటుంది. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, రవీంద్రనాథ్ ఠాగూర్, నేతాజీ సుభాశ్ చంద్రబోస్ వంటివారు ఏనాడు ప్రజలను విభజించేలా వ్యవహరించలేదు. మరి మీరంతా ఎవరు..? భారత స్వాతంత్ర్యం కోసం బెంగాల్ ప్రజలు ప్రాణాలు త్యాగం చేశారు. ఇప్పుడు భారత పౌరులుగా నిరూపించుకోవాలని కృష్ణనగర్ ప్రాంతంలో నిర్వహించిన ర్యాలీలో దీదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో భాజపా ఎంపీలకు ఇటీవల ప్రధాని మోదీ (ఖఓ ఓనీటతి) దిశానిర్దేశర చేశారు. ఆ పక్రియ సరళంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హత లేని వారిని తొలగించడమే దాని ఉద్దేశమని, ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని ఆదేశించారు.

కబ్జా చేసినట్లు రుజువు చేస్తే జైలుకెళతా

హైదరాబాద్, తాను ఎలాంటి కబ్జాలకు పాల్పడ లేదని.. తానేంటో ప్రజలకు తెలుసునని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. తాను కబ్జాలకు పాల్పడినట్లు వస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఐడీపీఎల్ భూముల కబ్జాపై తనపై ఇద్దరు నేతలు అసత్య ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. ఆ భూముల్లో నివాసం ఉంటున్న పేదల జోలికి వెళ్తే ఆత్మాహుతి చేసుకుంటానని ఆయన హెచ్చరించారు. ఆ భూముల్లో తాను గజం జాగా కబ్జా చేశానని నిరూపిస్తే.. తాను జైలుకెళ్లేందుకు సిద్ధమని చెప్పారు. రూ. 4 వేల కోట్ల విలువైన భూ వివాదంపై లోతుగా దర్యాప్తు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా పాల్పడుతున్నారని తాను గతంలోనే చాలాసార్లు ఫిర్యాదు చేశానని ఆయన గుర్తు చేశారు. అక్కడ స్థానికంగా ఉంటున్న ఇంద్రనగర్ 70 ఏళ్ల క్రితం ఏర్పడిందని తెలిపారు. అక్కడ నివసిస్తున్న ప్రజల కోసం డ్రైనేజీ, రహదారుల సౌకర్యం కల్పించాలంటూ జీహెచ్ఎంసీ నుంచి గతంలో నిధులు తీసుకొచ్చానని వివరించారు. అయితే ఐడిపిఎల్ ఉద్యోగులను తాను బెదిరించాననేది పూర్తిగా అవాస్తవమని ప్రకటించారు. ఈ ఆరోపణలను తాను పూర్తిగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు.తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మాధవరం కృష్ణారావుపై ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలపై బుధవారం ఎమ్మెల్యే కృష్ణారావు కాస్తా ఘాటుగా స్పందించారు.దాంతో ఎమ్మెల్యే కృష్ణారావుపై జాగృతి నేతలతోపాటు అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. ఆధారాలతో సహా అన్ని విషయాలు బయటపెడతానంటూ కవిత స్పష్టం చేశారు.

కొండా సురేఖకు బిగ్ షాక్.. అరెస్టు వారెంట్ జారీ? ఇప్పుడెలా?

హైదరాబాద్,తెలంగాణ మంత్రి కొండా సురేఖకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పరువునష్టం కేసులో సురేఖపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. కొండా సురేఖపై కేటీఆర్ పెట్టిన కేసును నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు విచారిస్తోంది. విచారణకు సురేఖ గైర్హాజరుపై కోర్టుకు ఎటువంటి సమాచారం లేకపోవడంతో న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎన్బీడబ్ల్యూ జారీ చేశారు. అనంతరం తదుపరి విచారణను వచ్చే ఏడాది ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేశారు.మంత్రి సురేఖకు ఎన్బీడబ్ల్యూ జారీ చేయడం సంచలనంగా మారింది. రాష్ట్రంలో రాజకీయ వర్గాలలో ఇదే ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. గత కొంతకాలంగా సురేఖ తీరు వివాదాలకు తావిస్తోంది. ఇటు పార్టీలోనూ అటు ప్రభుత్వంలోనూ ఆమె పోరాటం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ప్రతిపక్షం కూడా మంత్రి సురేఖను టార్గెట్ చేస్తోంది. గతంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పై మంత్రి సురేఖ సంచలన ఆరోపణలు చేశారు.ఫోన్ ట్యాపింగ్ తోపాటు సున్నితమైన అంశాల్లో కేటీఆర్ లక్ష్యంగా మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెను దుమారం రేపాయి. ఒకవైపు సినీ నటుడు నాగార్జున, మరోవైపు కేటీఆర్ సురేఖ ఆరోపణలపై పరువునష్టం కేసు దాఖలు చేశారు. ఇటీవల నాగార్జునకు మంత్రి కొండా సురేఖ క్షమాపణలు చెప్పడంతో ఆయన కేసు ఉపసంహరించుకున్నారు. అయితే కేటీఆర్ పై చేసిన వ్యాఖ్యలను మాత్రం మంత్రి సురేఖ వెనక్కి తీసుకునేది లేదని గతంలోనే ప్రకటించారు. కేటీఆర్ తో న్యాయపోరాటం చేస్తానని అప్పట్లోనే స్పష్టం చేశారు.ఇక కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేయాల్సిందిగా ఆగస్టులోనే నాంపల్లి కోర్టు పోలీసులను సూచించింది. సురేఖకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. మంత్రి సురేఖ తనపై చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, తన పరువుకు నష్టం కలిగించేవిగా ఉన్నాయని కేటీఆర్ వాదిస్తున్నారు. తాజాగా ఈ కేసులోనే మంత్రిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ కావడం చర్చనీయాంశం అవుతోంది. ఇప్పుడు మంత్రి సురేఖ ఏం చేయనున్నారు? ఆమె తరఫు న్యాయవాదులు పరిస్థితిని ఇంతవరకు ఎందుకు రానిచ్చారు? అన్న అంశాలపై విస్తృత చర్చ జరుగుతోంది.

తెలంగాణ ఎంపీలకు మోడీ క్లాస్.. ఇకనైనా మారతారా?

న్యూఢిల్లీ,తెలంగాణ బీజేపీ ఎంపీల పనితీరుపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మీరు పనిచేయలేరా? పార్టీని ముందుకు తీసుకువెళ్లలేరా? అంటూ.. వారికి క్లాస్ ఇచ్చారు. తాజాగా గురువారం ఉదయం రెండు తెలుగు రాష్ట్రాల ఎన్డీయే కూటమి ఎంపీలకు.. ప్రధాని అల్పాహార విందు ఇచ్చారు. ఈ సమయంలో ఆయన తెలంగాణ ఎంపీలకు సుదీర్ఘ క్లాస్ పీక్ పీకారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో డిపాజిట్ కూడా దక్కకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. 2014 నుంచి ఇన్నేళ్లలో ఎప్పుడూ బీజేపీ డిపాజిట్ కూడా దక్కించుకోకపోవడం అనేది లేదని.. ఇప్పుడు తొలిసారి తాను విన్నానని ఆయన చెప్పారు. కలివిడిగా లేకపోతే.. ఏదీ సాధ్యం కాదని.. గత కొన్నాళ్లుగా జరుగుతున్న పరిణామాలను ఆయన ప్రస్తావించారు. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు చేసే స్థాయిలో ఉన్నామన్న ప్రధాని మోడీ.. అంతర్గత విభేదాలతో పార్టీని నాశనం చేయొద్దని ఒకింత ఘాటుగానే చెప్పుకొచ్చారు. నాయకుల విభేదాలతో పార్టీపై ప్రభావం పడుతోందన్నారు.''మీరు చేయలేకపోతే.. చెప్పండి. పార్టీలో సంస్కరణలు తీసుకువస్తాం.'' అని హెచ్చరించడం ద్వారా.. నాయకులకు గట్టిగానే మోడీ దిశానిర్దేశం చేసినట్టు అయింది. ఇక, రాజకీయంగా పుంజుకోవాలని.. వచ్చే ఎన్నికలలో విజయం దక్కించుకుని అధికారం చేపట్టే స్థాయికి ఎదగాలని సూచించారు. అవసరమైతే.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఏం చేస్తున్నారు? ప్రజల మధ్య పార్టీ ఎలా పుంజుకుంటోంది? అనే విషయాలను అధ్యయనం చేయాలని కూడా ప్రధాని సూచించారు.

మార్పు తథ్యం..

ఇప్పటి వరకు తెలంగాణలో పరిణామాలు అందరికీ తెలిసిందే. ఒకరంటే ఒకరికి పడకపోవడం.. ఆధిపత్య రాజకీయాలు వంటివి బీజేపీని ఇరుకున పెట్టాయి. అయితే.. ఇప్పటి వరకు సీనియర్లు జోక్యం చేసుకున్నా పట్టించుకోలేదు. కానీ.. ఇప్పుడు ప్రధాని నేరుగా జోక్యం చేసుకునే సరికి.. పరిస్థితి లో మార్పు స్పష్టంగా వస్తుందని అంటున్నారు పరిశీలకులు. ప్రధాని ఇంతలా జోక్యం చేసుకున్నారంటే.. ఏదో మార్పు జరుగుతుందన్న స్పష్టత వచ్చినట్టేనని కూడా అంటున్నారు.

నాలుగు రాష్ట్రాల్లో ముగిసిన సర్ ప్రక్రియ

న్యూఢిల్లీ, తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి ఎన్నికల సంఘం తాజా అప్‌డేట్ ఇచ్చింది. వీటిలో తమిళనాడు, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్ సహా అండమాన్ నికోబార్ దీవుల్లో ఈ గడువును పొడిగించింది. పశ్చిమబెంగాల్, రాజస్థాన్, లక్షద్వీప్, గోవాల్లో మాత్రం ఈ గడువు గురువారంతో ముగిసింది. తమిళనాడు, గుజరాత్‌లలో డిసెంబర్ 14వరకు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అండమాన్ నికోబార్ దీవులకు డిసెంబర్ 18వరకు, ఉత్తర్ ప్రదేశ్‌లో డిసెంబర్ 26 వరకు గడువు పెంచుతున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. వీటికి అనుగుణంగా సవరణ జాబితా ప్రచురణ తేదీలు కూడా మార్చినట్లు తెలిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ సర్‌పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఐదు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో 'సర్' గడువును పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. రెండో దశ కింద మొత్తం 12 రాష్ట్రాల్లో, యూటీల్లో 'సర్' పక్రియ చేపట్టింది ఈసీ. అందులో భాగంగా డిసెంబర్ 11లోగా పూర్తి చేయాలని నిర్ణయించింది. గోవా, లక్షద్వీప్, రాజస్థాన్, పశ్చిమ్ బెంగాల్‌లలో ఈ గడువు ముగిసింది. ఈ నాలుగు రాష్ట్రాల ముసాయిదా ఓటర్ల జాబితా డిసెంబర్ 16 ప్రచురించనున్నట్లు ఈసీ తెలిపింది. 2026లో పశ్చిమ్ బెంగాల్‌లో ఎన్నికల నేపథ్యంలో.. 'సర్' గడువు పొడిగిస్తారని అంతా భావించారు. కానీ, ఈసీ ఆ అవకాశం లేకుండా చేసింది. తాజా పొడిగింపునకు ముందు ఈసీ కేరళ షెడ్యూల్‌ను సవరించింది. డిసెంబర్ 18 వరకూ గడువు నిర్దేశరచింది. ఈనెల 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తామని పేర్కొంది.

మీరు చేయాల్సిన పనులు నాకే చెబితే ఎలా?

అమరావతి, ఏపీ కేబినెట్ సమావేశంలో పలు కీలక ప్రాజెక్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం పలు అంశాలపై మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. జిల్లాలో భూ కేటాయింపులు, రెవెన్యూ సమస్యలపై జిల్లాలో సమీక్షించాలని ఇంచార్జి మంత్రులను సీఎం ఆదేశించారు. మంత్రులు పరిష్కరించాల్సిన పనులను తమ దృష్టికి తీసుకొస్తే ఎలా అని సీఎం ప్రశ్నించారు. ఇక చేనేతలకు ఉచిత విద్యుత్ అంశాన్ని ఆర్థిక శాఖ పెండింగ్‌లో ఉంచడంపై పలువురు మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సూర్యఘర్‌తో అనుసంధానం చేశారని మంత్రులు చెప్పారు. అయితే సూర్యఘర్‌తో సంబంధం లేకుండా చూడాలని... దీనిని వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా జగనన్న కాలనీలో గృహాలు నిర్మించని లబ్దిదారుల పట్టాలు రద్దు చేయాలని పలువురు మంత్రులు కోరారు. చాలా ప్రాంతాల్లో ఇల్లు నిర్మించకుండా వృథాగా ఉన్నాయని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఇప్పటికే లబ్దిదారుల పేరిట స్థలాలు రిజిస్టర్ అయి ఉన్నాయని మరికొంతమంది మంత్రులు చెప్పారు. పట్టాలు రద్దు చేయడం సాధ్యం కాదని సీఎం దృష్టికి మంత్రి అచ్చెన్నాయుడు తీసుకెళ్లగా.. ఇది నిజమేనని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కూడా తెలిపారు. దీనిపై మంత్రులు కూర్చొని ఆలోచించాలని ముఖ్యమంత్రి సూచించారు. లబ్దిదారులకు నోటీసులు ఇచ్చి ఇల్లు నిర్మిస్తారా? లేదా? అనేది తెలుసు కోవాలన్నారు. ఒకవేళ ఇల్లు కట్టుకోకపోతే కొత్త లబ్దిదారులకు మూడు సెంట్లు ఇవ్వాలని గతంలో చెప్పిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. అలాగే రెవెన్యూ సమస్యలన్నీ కూడా ఏడాదిలోగా పరిష్కరించాలని సీనియర్ ఐఏఎస్ అధికారి సాయి ప్రసాద్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అయితే, కేబినెట్ సమావేశానికి ఆలస్యంగా వచ్చిన నలుగురు మంత్రులపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. మంత్రివర్గ సమావేశానికి ఆలస్యంగా వస్తే ఎలా అని ప్రశ్నించారు. కనీసం సరైన క్రమశిక్షణ పాటించాలి కదా అని మందలించారు. మంత్రి మండలి సమావేశం ఉదయం 10:30 గంటలకు అని ముందే తెలుసు కదా అని నిలదీశారు. ఈ సమావేశానికి తగ్గినట్లుగా మంత్రులు ఎందుకు ప్లాన్ చేసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ సారి నుంచి కేబినెట్ భేటీకి ఆలస్యంగా వస్తే సహించేది లేదని మంత్రులకు వార్నింగ్ ఇచ్చారు.

జగన్ పాదయాత్రపై సస్పెన్స్.. స్ట్రాంగ్ రీజన్ ఇదే..!

వైసీపీ అధినేత జగన్ పాదయాత్ర చేసేందుకు సిద్ధమవుతున్నారన్న వార్తలు తరచుగా వినిపిస్తున్నాయి. గతంలోనే ఆయన 2019 ఎన్నికలకు ముందు 3000 కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేశారు. ఆ సమయం లో అనేక హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చారు. ఇక ఇప్పుడు కూడా అదే పంథాను అనుసరిస్తారని ఖచ్చితంగా పాదయాత్రకు సిద్ధమవుతారని వైసిపి అనుకూల మీడియా సహా వైసిపి నాయకుల్లోను పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అయితే అంతర్గత సంభాషణలో మాత్రం దీనిపై తీవ్రస్థాయిలో మరో వాదన వినిపిస్తోంది.ప్రస్తుతం జగన్ అంత సుదీర్ఘ పాదయాత్ర చేసే అవకాశం లేదని కీలక నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. దీనికి ఆరోగ్య సమస్యలేనని అంటున్నారు. అప్పట్లో కూడా ఆయనకు ఆరోగ్యం సహకరించలేదన్న విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఇది వాస్తవమే. గతంలో పాదయాత్ర చేసినప్పుడు ఒకటికి రెండు రోజులపాటు విశ్రాంతి తీసుకున్న సందర్భం తెలిసిందే. అప్పట్లో డాక్టర్ గురుమూర్తి (ప్రస్తుత తిరుపతి ఎంపీ) ఆయనకు వైద్యం చేశారు. అదేవిధంగా డాక్టర్ ఐ.వి రావు కూడా జగన్‌కు అప్పట్లో వైద్యసహకారం అందించారు.తొలిసారి పాదయాత్ర చేసినప్పుడే పలు కాంప్లికేషన్స్ ఎదుర్కొన్న జగన్ ఇప్పుడు అంత సుదీర్ఘ పాదయా త్ర చేయగలరా అనేది ప్రశ్న. ఇదే ఇప్పుడు వైసీపీలోనూ చర్చనీయాంశంగా మారింది. అధికారంలో ఉన్నప్పుడు జరిగిన కొన్ని సంఘటనలను నాయకులు గుర్తు చేస్తున్నారు. ఒక శంకుస్థాపన సమయంలో జగన్ కిందకు వంగి కొబ్బరికాయ కొట్టడానికి కూడా ఇబ్బంది పడ్డారు. దీంతో నిలబడే ఆయన కొబ్బరికాయ కొట్టారు. అదే విధంగా ఒక సందర్భంలో వంగి నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని కూడా నిలబడే ఆయన పూర్తి చేశారు.సో దీన్నిబట్టి ఆయన ఆరోగ్యం ముఖ్యంగా కండరాల పరిస్థితి పాదయాత్రకు సహకరించక పోవచ్చన్నది వైసిపిలో అంతర్గతంగా వినిపిస్తున్న చర్చ. ఏదేమైనా పాదయాత్ర చేయాలన్న విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని కూడా తెలుస్తోంది. ఇది కేవలం రాజకీయ వాదాన్ని, అదేవిధంగా ప్రజల్లో ఒక ఇమేజ్‌ను పెంచేందుకు జరుగుతున్న చర్చగా మరికొందరు చెబుతున్నారు. పాదయాత్ర పై ఇంకా నిర్ణయం తీసుకోలేదని గుంటూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మీడియాకు వెల్లడించారు.అంతేకాదు ఇప్పుడు పాదయాత్ర చేయాల్సిన అవసరం కూడా జగన్‌కు లేదని ఆయన చెప్పడం ఆరోగ్య సమస్యలకు సంబంధించా.. లేకపోతే రాజకీయ వర్గాలకు సంబంధించిన అనేది సందేహంగా మారింది. ఏదేమైనా జగన్ పాదయాత్ర పై స్పష్టమైన వైఖరి అయితే ఇంకా పార్టీలో కనిపించడం లేదు. ప్రస్తుతం ఇది ప్రచారానికి మాత్రమే పరిమితమైంది.

సర్పంచ్ ఎన్నికను బహిష్కరించిన గ్రామస్థులు

కామారెడ్డి,తెలంగాణలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలవగా.. మధ్యాహ్నం 1 గంటల వరకు ముగిసాయి. ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే పోలింగ్ నేపథ్యంలో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొనగా కామారెడ్డిలోని ఓ గ్రామంలో మాత్రం ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు. దీంతో ఆ గ్రామంలో సర్పంచ్ ఎన్నికకు బ్రేక్ పడినట్లైంది. జిల్లాలోని రామారెడ్డి మండలం చిన్న గోకుల్ తండా వాసులు ఎన్నికలను బహిష్కరించారు. తమకు సమాచారం ఇవ్వకుండా పెద్ద గోకుల్ తండా వాసులు సర్పంచ్‌ను ఏకగ్రీవం చేసుకున్నారని గ్రామస్తులు నిరసనకు దిగారు.

సర్ పై చర్చ...డౌట్లు తీర్చిందా ?

హైదరాబాద్,సర్ మీద దేశంలోని విపక్షం అంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తోంది. ప్రధానంగా వారు చేస్తున్న ఆరోపణ అంతా ప్రతిపక్షాల ఓట్లు తీసేస్తున్నారు అని. అలా చేయడం వల్లనే బీజేపీకి విజయావకాశాలు పెరుగుతున్నాయని. అలాగే ఈవీఎంల పనితీరు మీద పెద్ద ఎత్తున సందేహాలను పార్లమెంట్ వ్యక్తం చేసింది. ఈవీఎంల కంటే పేపర్ బ్యాలెట్ బెట్ అని కూడా ప్రతిపక్షం మూకుమ్మడిగా ఓటేసింది. అందులో వైసీపీ వంటి తటస్థ పార్టీలు కూడా ఉండడం విశేషం. అయితే సర్ మీద రెండు రోజుల పాటు ధాటీగా లోక్ సభలో చర్చ సాగింది. అయితే దీని మీద విపక్షాల సందేహాలు ఏ మేరకు తీరాయి అన్నది ఒక చర్చ అయితే ప్రభుత్వం పక్షాన ఏమి చేసింది ఏం చేయబోతోంది అన్నది మరో చర్చగా ఉంది.

తిప్పికొట్టడం ఓకే :

ఇక రాహుల్ గాంధీ వర్సెస్ అమిత్ షా మధ్య భారీగానే డైలాగ్ వార్ నడిచింది. రాహుల్ గాంధీ నకిలీ ఓట్లు పెద్ద ఎత్తున ఉన్నాయని లేవనెత్తిన ప్రశ్నలకు ప్రభుత్వం తరఫున జవాబు ఏమి వచ్చింది అన్నది కూడా విశ్లేషకులు మేధావులు ఆలోచిస్తున్నారు. ప్రభుత్వం ఎపుడైనా సభలో తన వాదనను సమర్థంగా వినిపించుకునే వెసులుబాటు ఉంటుంది. అదే సమయంలో విపక్షం మీద దాడి చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. రాహుల్ కంటే తాను అనుభవంలో ఎక్కువగానే చట్ట సభలో ఉన్నాను అని అమిత్ షా చెప్పారు. సర్ అన్నది ఎన్నికల సంస్కరణలో భాగంగానే అని ఆయన చెప్పారు. అయితే నకిలీ ఓట్ల విషయం అయితే చెప్పలేదని ఇండియా కూటమి అంటోంది తాము ఎంతసేపూ అడుగుతున్న దానికి ప్రభుత్వం వైపు నుంచి బదులు రాలేదని అంటోంది.

ఈవీఎంల విషయంలోనూ :

ఇక ఈవీఎంల పనితీరు మీద సందేహాలు ఉన్నాయని విపక్షాలు అంటే అది కాంగ్రెస్ హయాంలోనే ప్రవేశపెట్టారు కదా అని అధికార పక్షం నుంచి వచ్చిన స్పందన. సరే ఎవరి టైంలో ప్రవేశపెట్టారు, ఎవరు ఎంతవరకూ తీసుకెళ్ళారు అన్నది పక్కన పెడితే ఈవీఎంల మీద డౌట్లు అన్ని పార్టీలకూ ఉన్నాయి కదా అని అంటున్నారు. ఈ రోజున ఎన్డీయే పక్షాన ఉన్న కొన్ని పార్టీలు కూడా గతంలో ఈవీఎంల తీరు మీద అనుమానం వ్యక్తం చేసిన సంగతిని కూడా గుర్తు చేస్తున్నారు. ఎపుడు ప్రవేశపెట్టినా టెక్నాలజీ అన్నది రోజు రోజుకీ విస్తరిస్తున్న వేళ మరింతగా పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకోవాలి కదా అన్న సూచనలు వస్తున్నాయి. అంతే కాదు ఎన్నికల్లో గెలుపు ఓటమి ముఖ్యం కాదు ఓడినా సమాధానం చెప్పుకునే విధంగా ఉండాలని అంటున్నారు. మొత్తం మీద చూస్తే సర్ విషయంలో కానీ ఈవీఎంల పనితీరు విషయంలో కానీ విపక్షాల నుంచి ఎదురైన ప్రశ్నలకు ప్రభుత్వం ధీటుగా సమాధానం అయితే ఇచ్చింది కానీ ఆ సందేహాల నివృత్తికి ఏమి చేస్తుంది అన్నదే ఆసక్తిగా ఉంది. అంతా కోరుతున్నట్లుగా పేపర్ బ్యాలెట్ కి మళ్ళీ వెళ్తామని ప్రభుత్వం చెబుతుందా అన్నది ఒక ప్రశ్న. అలాగే సర్ విషయంలో మరింత పారదర్శకంగా ముందుకు సాగేలా ఎన్నికల సంస్కరణలకు సిద్ధమవుతామని చెబుతారా అన్నది కూడా మరో పాయింట్ గా ఉంది చూడాలి మరి ఏమి చేస్తుందో.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com